


సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com




ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 57 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజిలు : 8, వెల రూ. 4, /- శనివారం - 17 - మే - 2025



2లో

## 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

కశ్మీర్‌లో భద్రతా బలగాల జాయింట్ ఆపరేషన్

కాశ్మీర్ లోయలో భద్రతా బలగాల సంయుక్త చర్యలు

గత 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

షోపియాన్, ట్రాల్ ప్రాంతాల్లో రెండు వేర్వేరు ఆపరేషన్లు

ఉగ్ర కార్యకలాపాల నేపథ్యంలో వ్యూహాలు సమీక్షించామన్న అధికారులు

కాశ్మీర్‌లో ఉగ్రవాద వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలిస్తామన్న ఐజీపీ

# 'హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం'



హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఈ ఏడాది అత్యధికంగా 17, 162 మెగా వాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025- 26 లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుం దని, 2034..35 నాటికి 31,808 మెగావాట్ల కు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. ఈ మేరకు సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. రైల్వే లైన్లు, మెట్రో , ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొత్త గా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారబోతోంది. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏ తో సమన్వయం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలి. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలి. ఫ్యూచర్ సిటీ లో మిగతా..2లో

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

"క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం"

తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు.

ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారు



వరంగల్: ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.4.5కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. "క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి. మామూలుగా మంత్రులు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేం మాత్రం మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు.. సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం" అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. మిగతా..2లో

## రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే

- సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం
- మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలి



2

- జూన్ 21న విశాఖలో ప్రధాని మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా డే కార్యక్రమం నిర్వహణపై సీఎం

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయింది



2

- 'కొండా సురేఖకు నా అభినందనలు'
- ఇది రహస్యమే కాదు. ఓపెన్ సీక్రెట్
- ఆ ఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమిషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసింది.

## 'సురేఖ వ్యాఖ్యల ఎఫెక్ట్.. రేవంత్ కమీషన్ల సంగతేంటి?'

- ఏయే మంత్రి ఎంత కమీషన్లు తీసుకున్నారో దర్యాప్తు చేపట్టాలి



2

- కొండా సురేఖ మంత్రులు కమిషన్లు తీసుకోవడం కామన్ అనడం బాధాకరం
- రాష్ట్రంలో మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని ఒప్పుకున్నారు
- మంత్రులు తీసుకున్న కమీషన్లు బయట పెట్టాలి

# ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలు చూశారు

- రూ.22 వేల కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ కాంప్లెక్స్ నిర్మాణం
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం
- ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏపీని క్లీన్ ఎనర్జీ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి




అనంతపురం : ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, అనంతపురం జిల్లా, గుంతకల్లు నియోజకవర్గం, బేతపల్లి గ్రామంలో రెన్యూ పవర్ సంస్థ ఏర్పాటు చేయనున్న రూ.22 వేల కోట్ల విలువైన భారీ హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతితో పాటు వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "రెన్యూ పవర్ ప్రాజెక్టుకు మనం వేస్తున్న పునాదిరాయి, భారతదేశ క్లీన్ ఎనర్జీ విప్లవానికి పునాదిరాయి వంటిది. రూ.22 వేల కోట్ల పెట్టుబడితో రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టు కేవలం గ్రిడ్‌లకు శక్తినివ్వడమే కాకుండా, నిరుద్యోగ యువత ఆశయాలకు ఊతమిస్తుంది" అని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ కాదని, అదొక ఉద్యమమని, భవిష్యత్ తరాలకు ఇదొక వారధి అని ఆయన అభివర్ణించారు. "రెన్యూ పవర్ వారి మిగతా..2లో

## చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీలో పెట్టుబడులు




- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయన్న మంత్రి
- బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్‌కు మంత్రి లోకేశ్ భూమిపూజ
- 2,300 ఎకరాల్లో రూ.22వేల కోట్లతో రెవెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటు

అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఏపీకి వివిధ సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టడానికి సీఎం చంద్రబాబు బ్రాండే దోహపడిందన్నారు. మిగతా..2లో

## తిరుమలలో అత్యున్నత స్థాయి భద్రతకు కార్యాచరణ..

## 14 ప్రవేశ ద్వారాలలో నిఘాకు చర్యలు

అన్నమయ్య భవన్‌లో నిన్న తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం

ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరు

అనంతపురం రేంజ్ డీఐజీ షెమూషీ భాజ్‌పేయీ అధ్యక్షతన సమావేశం




తిరుపతి: తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ షెమూషీ భాజ్‌పేయీ అధ్యక్షతన మిగతా..2లో



2లో

## గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు.. 80 మంది దుర్మరణం

గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 80 మంది పాలస్తీనియన్ల మృతి

ఖాన్ యూనిస్‌లోని నాసర్ ఆసుపత్రిలో 54 మృతదేహాలు నమోదు

దాడులతో గాజా యూరోపియన్ ఆసుపత్రి (క్యాన్సర్ ఆసుపత్రి) సేవలు బంద్

# ఆపరేషన్ సిందూర్ ట్రైలరే, అసలు సినిమా ముందుంది

- ఆపరేషన్ సిందూర్ ట్రైలరేనన్న రాజ్‌నాథ్ సింగ్
- సమయం వచ్చినప్పుడు పూర్తి సినిమా చూపిస్తామని వ్యాఖ్య
- ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తే పాక్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిక
- బ్రహ్మోస్ క్షిపణి దెబ్బకు పాక్ దిగివచ్చిందన్న రక్షణ మంత్రి
- 23 నిమిషాల్లోనే పాక్‌లో ఉగ్ర మూకలను దెబ్బతీశామని వెల్లడి



ఢిల్లీ: ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగిసిపోలేదని, ప్రపంచం ఇప్పటివరకు చూసింది కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని, సరైన సమయం వచ్చినప్పుడు భారత సాయుధ దళాలు పూర్తి సినిమా చూపిస్తాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలను ప్రోత్సహిస్తున్న తీరుపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్‌లోని భుజ్‌లో ఉన్న భారత వైమానిక దళ స్థావరంలో శుక్రవారం ఎయిర్ వారియర్స్, భద్రతా దళాలను ఉద్దేశించి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. "ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. అందరూ ఇప్పటిదాకా చూసింది మిగతా..2లో

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com
శనివారం - 17 - మే - 2025

# 'సురేఖ వ్యాఖ్యల ఎఫెక్ట్.. రేవంత్ కమీషన్ల సంగతేంటి?'

హైదరాబాద్: తెలంగాణలో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. మంత్రులు కమీషన్లు తీసుకోకుండా సంతకాలు చేయరు అని మాట్లాడటం ఆసక్తికరంగా మారింది. దీంతో, ఆమె వ్యాఖ్యలపై తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ.. ఏయే మంత్రి ఎంత కమీషన్లు తీసుకున్నారో దర్యాప్తు చేపట్టాలని రేవంత్ సర్కార్‌ను డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ మంత్రులు కమిషన్లు తీసుకోవడం కామన్ అనడం బాధాకరం. అంటే రాష్ట్రంలో మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని ఒప్పుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని ఇదే డిమాండ్ చేస్తున్నాం. ఏయే శాఖ మంత్రి ఎంత తీసుకున్నారో దర్యాప్తునకు ఆదేశించాలి. మంత్రులు తీసుకున్న కమీషన్లు బయట పెట్టాలి అని వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అతీతంగా తిరంగా యాత్ర.. ఇదే సమయంలో తిరంగా యాత్రపై మాట్లాడుతూ.. పహల్గాం ఘటనలో 26 మందిని ఉగ్రమూకలు హతమార్చారు. మానవత్వం లేకుండా పిల్లల ముందు తండ్రిని, భార్య ముందు భర్తను పేర్లు అడిగి హతమార్చారు. మానవ సమాజానికే సవాల్ గా మారిన ఈ ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. పాకిస్తాన్‌లో 9 ఉగ్రవాద స్థావరాలను పేల్చివేశాం. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేయడం జరిగింది. ఉగ్రవాద చర్యలతో మనదేశం బలవుతూనే ఉంది. జమ్మూకశ్మీర్‌లోనే 46 వేల మందిని ఉగ్రమూకలు బలితీసుకున్నాయి. మన సైనికులు నూతన చరిత్రను ప్రారంభించారు. గతంలో ఉగ్రమూకలు దాడి చేసినప్పుడు.. మరణించినవారి ఫోటో దగ్గర గులాబీ పువ్వు పెట్టడం వరకే పరిమితం అయ్యే వాళ్ళం. 2009లో 40 మందిని ఊచకోత కోశారు. భారత్‌పై దాడి చేస్తే ప్రతీకారం ఎలా ఉంటుందో చూపించాం. ఉగ్రవాదుల శిక్షణ కార్యక్రమాలు, ఉగ్రవాదుల నివాసాలను ధ్వంసం చేశాం. కరడుకట్టిన ఉగ్రవాదులను అంతం చేశాం. పాకిస్తాన్ పిల్ల చేష్టలతో దాడికి ఒడిగట్టింది.. భారత సైన్యం తిప్పికొట్టింది. ఆపరేషన్ సిందూర్ ఆగలేదు.. ఇంకా కొనసాగుతోంది. రక్షణ రంగంలో ప్రతి సైనికుడు రాణించారు. ఎస్-400, బ్రహ్మోస్త్రం పనితీరు దేశ ప్రజలు గమనించారు. భారత ఆర్మీకి అన్ని రకాలుగా సమకూర్చడం జరిగింది. ఆర్మీకి అవసరమైన వాటిలో 35 శాతం మనమే సమకూర్చుకున్నాం. మిథానీ, DRDAలో వసతులు మెరుగు పరుస్తున్నాం. ఆర్డినెన్సు ఫ్యాక్టరీలను మరింత సంసిద్ధం చేసుకున్నాం. పాకిస్తాన్‌ను ప్రపంచం ముందు దోషిగా నిలబెడతాం. భారత సైనికులు అనుసరించిన స్ట్రాటజీని ప్రపంచం మొత్తం చూసింది. రాజకీయాలకు అతీతంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాం. అన్ని రాజకీయ పార్టీలను, ఎమ్మెల్యేలను, ఎంపీలను ఆహ్వానిస్తున్నాం' అని చెప్పుకొచ్చారు.

# తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయింది

హైదరాబాద్: మంత్రి కొండా సురేఖకు మాజీ మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. మంత్రులు కమిషన్లు తీసుకోకుండా ఏ పనిచేయరంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో 'కనీసం ఇప్పటికైనా కొన్ని నిజాలు బయట పెట్టినందుకు మంత్రి కొండా సురేఖకు నా హృదయపూర్వక అభినందనలు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయింది. ఇది రహస్యమే కాదు. ఓపెన్ సీక్రెట్. అంతేకాదు, ఈ ప్రభుత్వంలో ఫైల్స్‌పై సంతకం చేసేందుకు మంత్రులు, వారి సహచర మంత్రులు 30శాతం కమిషన్ తీసుకుంటున్నారు. ఇదే కమిషన్ల వ్యవహారంలో సచివాలయంలో పలువురు కాంట్రాక్టర్లు ధర్నా చేసిన విషయం గుర్తుందా? అని ప్రశ్నించారు. ఆ ఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమిషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసింది. ఈ సందర్భంగా కొండా సురేఖని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. కమిషన్లు తీసుకుంటున్న మంత్రుల వివరాల్ని బయటపెట్టాలి. ప్రజల ముందు బహిర్గతం చేయాలని అన్నారు. ఇదే అంశంపై రాహుల్ గాంధీ,రేవంత్‌రెడ్డిలు వారి సొంత కేబినెట్ మంత్రి చేసిన ఆరోపణలపై మీరు దర్యాప్తుకు ఆదేశించగలరా?'అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## రికార్డు సృష్టించేలా విశాఖలో

# అంతర్జాతీయ యోగా డే

అమరావతి: రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలన్నారు. జూన్ 21న విశాఖలో ప్రధాని మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా డే కార్యక్రమం నిర్వహణపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామం, వార్డులో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నెల రోజుల పాటు యోగా ప్రాక్టీస్ చేసిన వారికి సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. విశాఖలో లక్షల మందితో కలిసి ప్రధాని మోదీ యోగాసనాలు వేస్తారని, ఆర్‌కే బీచ్ నుంచి సముద్రతీరం పొడవునా లక్షల మందితో యోగా డే నిర్వహించనున్నట్టు వెల్లడించారు. యోగా డే అనంతరం కూడా రాష్ట్రంలో యోగా సాధన ఒక వ్యాపకంగా మారాలని సీఎం అన్నారు.

## గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు..

# 80 మంది దుర్మరణం

గాజా: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. గురువారం జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 80 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది గాయపడ్డారని పాలస్తీనా వైద్య వర్గాలు వెల్లడించాయి. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంలో జరిగిన దాడుల్లో మహిళలు, చిన్నారులతో సహా 54 మంది మరణించినట్లు నాసర్ ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దాడుల కారణంగా గాజాలో క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించే ఏకైక ఆసుపత్రి అయిన గాజా యూరోపియన్ హాస్పిటల్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయని అక్కడి ఆరోగ్య అధికారులు తెలిపారు. ఆసుపత్రి మౌలిక వసతులు, మురుగునీటి లైన్లు దెబ్బతినడంతో పాటు, అంతర్గత విభాగాలు ధ్వంసమయ్యాయని, ఆసుపత్రికి దారితీసే రహదారులు నాశనమయ్యాయని వారు వివరించారు. గాజా నగరం మరియు ఉత్తర గాజాలోని ఇతర ప్రాంతాలపై జరిగిన దాడుల్లో మరో 26 మంది మరణించినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో హమాస్‌ను ఓడించే ప్రయత్నాలలో భాగంగా ఇజ్రాయెల్ సైన్యం పూర్తి శక్తితో గాజాలోకి ప్రవేశిస్తుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మంగళవారం హెచ్చరించిన నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. మార్చి 18న రెండు నెలల కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ గాజాలో భారీ సైనిక చర్యలను తిరిగి ప్రారంభించింది. అప్పటి నుండి 2,876 మంది పాలస్తీనియన్లు మరణించగా, 7,800 మందికి పైగా గాయపడ్డారు. అక్టోబర్ 7, 2023న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి మొత్తం పాలస్తీనియన్ల మరణాల సంఖ్య 53,010కి చేరుకుందని గాజా ఆరోగ్య అధికారులు గురువారం తెలిపారు. పౌరులపై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ "జనావాసాలను ఖాళీ చేయించి, ప్రదేశాలను కుదించే" విధానాన్ని అనుసరిస్తోందని గాజాలోని పౌర రక్షణ విభాగం ప్రతినిధి మహమూద్ బసల్ ఆరోపించారు. పాఠశాలలు, నిరాశ్రయుల శిబిరాలపై దాడులు జరుగుతాయనే భయంతో వేలాది మంది రాత్రుళ్లు వీధుల్లో గడిపారని, బాధితుల వద్దకు సహాయక బృందాలు చేరుకోకుండా ఇజ్రాయెల్ దళాలు అడ్డుకుంటున్నాయని, పౌర రక్షణ మౌలిక సదుపాయాలను క్రమపద్ధతిలో నాశనం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మార్చి 2 నుండి గాజాకు ఎలాంటి మానవతా సహాయం అందలేదని, గాజాలో అర మిలియన్ ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి.

# 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

ఢిల్లీ: కశ్మీర్ లోయలో భద్రతా బలగాలు ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాయి. గత 48 గంటల్లో చేపట్టిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో ఆరుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారులు శుక్రవారం శ్రీనగర్‌లో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో కశ్మీర్ ఐజీపీ వీకే బిర్ది కుమార్, విక్టర్ ఫోర్స్ జీఓసీ మేజర్ జనరల్ ధనంజయ జోషి, సీఆర్పీఎఫ్ ఐజీ మితేష్ జైన్ పాల్గొన్నారు. ఐజీపీ వీకే బిర్ది కుమార్ మాట్లాడుతూ, "కాశ్మీర్ లోయలో పెరిగిన ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో అన్ని భద్రతా దళాలు తమ వ్యూహాలను సమీక్షించుకున్నాయి. ఈ సమీక్ష అనంతరం ఆపరేషన్లపై మరింత దృష్టి సారించాం. ఈ సమన్వయం, పెరిగిన ఏకాగ్రతతో గత 48 గంటల్లో రెండు విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించాం. షోపియాన్‌లోని కెలార్, ట్రాల్ ప్రాంతాల్లో జరిగిన ఈ ఆపరేషన్లలో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. కాశ్మీర్ లోయలో ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి మేము కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. విక్టర్ ఫోర్స్ జీఓసీ మేజర్ జనరల్ ధనంజయ జోషి కెలార్, ట్రాల్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ల గురించి వివరిస్తూ, ఈ రెండు ఆపరేషన్ల సమయంలో భద్రతా దళాలు ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావించారు. "మే 12న కెలార్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో ఉగ్రవాద బృందం సంచరిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. మే 13 ఉదయం, కొంత కదలికను గుర్తించిన మా బృందాలు ఉగ్రవాదులను హెచ్చరించగా, వారు కాల్పులతో ప్రతిస్పందించారు. మా దళాలు వారిని మట్టుబెట్టాయి" అని ఆయన వివరించారు. "ట్రాల్ ప్రాంతంలోని ఒక గ్రామంలో రెండో ఆపరేషన్ జరిగింది. మేము గ్రామాన్ని చుట్టుముడుతుండగా, ఉగ్రవాదులు వేర్వేరు ఇళ్లలో స్థానాలు ఏర్పరచుకుని మాపై కాల్పులు జరిపారు. ఈ సమయంలో, గ్రామస్తులైన పౌరులను రక్షించడం మాకు పెద్ద సవాలుగా మారింది. ఆ తర్వాత ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాం. హతమైన ఆరుగురు ఉగ్రవాదుల్లో షాహిద్ కుట్టే అనే వ్యక్తి ఒక జర్మన్ పర్యాటకుడిపై దాడితో సహా రెండు పెద్ద దాడుల్లో పాల్గొన్నాడు. నిధుల సమీకరణ కార్యకలాపాల్లో కూడా అతడి ప్రమేయం ఉంది" అని మేజర్ జనరల్ ధనంజయ జోషి తెలిపారు.

# త్వరలోనే పుతిన్‌తో ముఖాముఖి భేటీ: ట్రంప్

అబుదాబీ: రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తుర్కియే వేదికగా ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు మొదలయ్యాయి. అయితే, వీటికి పుతిన్ గైర్హాజరయ్యారు. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే తాను పుతిన్ తో ముఖాముఖి భేటీ కానున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా పర్యటన ముగించుకుని ట్రంప్ అమెరికా తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన ఆయన.. రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చల అంశాన్ని ప్రస్తావించారు. "ఈ చర్చలకు పుతిన్ హాజరుకాకపోవడం నన్నేమీ ఆశ్చర్యపర్చలేదు. ఎందుకంటే నేను లేకుండా ఆయన అక్కడకు వెళ్లరు. బహుశా మేమిద్దరం కలుసుకునే సమయం వచ్చినట్లు ఉంది. వీలైనంత త్వరలోనే పుతిన్‌తో నేను ముఖాముఖిగా సమావేశమవుతా" అని ట్రంప్ వెల్లడించారు. తన కుమార్తె టిఫనీ బిడ్డకు జన్మనిచ్చిందని, అందుకే తాను వెంటనే అమెరికా వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. 30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ అంగీకరించిన విషయం తెలిసిందే. అయితే రష్యా మాత్రం ఎలాంటి నిర్ణయమూ చెప్పలేదు. ఈ క్రమంలోనే తుర్కియే వేదికగా ఇరు దేశాలు శాంతి చర్చలు ప్రారంభించాయి. మూడేళ్ల యుద్ధంలో ఇరు దేశాల మధ్య నేరుగా చర్చలు జరగడం ఇదే తొలిసారి. దీనికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన బృందంతో హాజరయ్యారు. కానీ, పుతిన్ మాత్రం తన స్థానంలో కేవలం ప్రతినిధుల బృందాన్ని పంపించారు. దీనిపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. యుద్ధాన్ని ముగించడం రష్యాకు ఇష్టం లేదని ఆరోపించారు.

# ఆపరేషన్ సిందూర్ ట్రైలరే,అసలు సినిమా ముందుంది

మొదటి పేజి తరువాయి



అందరూ ఇప్పటిదాకా చూసింది ఒక ట్రైలర్ మాత్రమే. సరైన సమయం వచ్చినప్పుడు భారత సాయుధ దళాలు పూర్తి చిత్రాన్ని ప్రదర్శిస్తాయి" అని ఆయన స్పష్టం చేశారు. ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో కలిసి వైమానిక స్థావరాన్ని సందర్శించిన రక్షణ మంత్రి, ఆపరేషన్ సిందూర్ ను విజయవంతంగా నిర్వహించినందుకు దళాలను అభినందించారు. తమ గడ్డపై ఉగ్రవాద ఫ్యాక్టరీలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మోస్ క్షిపణి శక్తిని పాకిస్థాన్ గుర్తించక తప్పలేదని అన్నారు. "పదేపదే నేరాలు చేసేవారిని ఎలాగైతే నిఘాలో ఉంచుతారో, అలాగే పాకిస్థాన్‌ను కూడా మేము ప్రొబేషన్‌లో ఉంచాం. కాల్పుల విరమణ అంటే చర్యలు పూర్తిగా ఆగిపోయినట్టు కాదు. ఒకవేళ పాకిస్థాన్ తన పద్ధతులు మార్చుకోకుండా మళ్లీ దుస్సాహసాలకు పాల్పడితే, మన దళాలు గట్టి గుణపాఠం చెబుతాయి... మళ్లీ చెబుతున్నా!" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "మన దేశంలో 'పగటిపూట చుక్కలు చూపించడం' అనే ఒక సామెత ఉంది. మేడ్ ఇన్ ఇండియా బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు 'రాత్రి చీకటిలో పగటి వెలుగు' చూపించింది" అంటూ రాజ్‌నాథ్ సింగ్ గర్జించగా, దళాలు హర్షధ్వానాలతో మద్దతు తెలిపాయి. "పాకిస్థాన్‌లో పెంచి పోషిస్తున్న ఉగ్రవాదాన్ని అణచివేయడానికి భారత వైమానిక దళానికి కేవలం 23 నిమిషాలు సరిపోయాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో మీరు చేసిన పని మా అందరికీ గర్వకారణం" అని ఆయన సైనికులను ఉద్దేశించి అన్నారు. దేశాన్ని భయభ్రాంతులకు గురిచేసే వారిని క్షమించే ధోరణికి బదులు, కఠినంగా శిక్షించే చర్యలకు ప్రాధాన్యతనిచ్చే భారతదేశ నూతన భద్రతా సిద్ధాంతాన్ని పునరుద్ఘాటిస్తూ, ప్రపంచంలో ఎక్కడైనా ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించి, దానికి బాధ్యులైన వారిని శిక్షిస్తామని ఆయన ప్రతినబూనారు. "ఆపరేషన్ 'సిందూర్' అంటే, అది కేవలం అలంకరణకు చిహ్నం కాదని, మీ పరాక్రమానికి, దృఢ సంకల్పానికి నిదర్శనమని మీరు ప్రపంచానికి చాటిచెప్పారు" అని సైనికులతో అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కార్యక్రమంలో భాగంగా పాకిస్థాన్‌కు నిధులు సమకూర్చడాన్ని కూడా రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. "అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి అందుకున్న నిధులలో ఎక్కువ భాగాన్ని పాకిస్థాన్ తన దేశంలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాల కోసమే ఖర్చు చేస్తుంది" అని ఆయన ఆరోపించారు. బెయిలౌట్ ప్యాకేజీపైనే ఎక్కువగా ఆధారపడుతున్న పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ ఇటీవల 1.023 బిలియన్ డాలర్ల రెండో విడత నిధులను విడుదల చేసిన విషయం గమనార్హం.

# 'హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం'

మొదటి పేజి తరువాయి




విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలి. ఫ్యూచర్ సిటీ లో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలి. సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను తీసుకురావాలి. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్ పాత్ లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# నా వ్యాఖ్యలను వక్రీకరించారు

మొదటి పేజి తరువాయి



సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం" అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. తన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో కొండా సురేఖ వివరణ ఇచ్చారు. భారాస ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు.

# చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీలో పెట్టుబడులు

మొదటి పేజి తరువాయి



సీఎం చంద్రబాబు బ్రాండే దోహపడిందన్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్‌కు శుక్రవారం నాడు మంత్రి లోకేశ్ భూమిపూజ చేశారు. 2,300 ఎకరాల్లో రూ.22 వేల కోట్లతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... రాయలసీమలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటుతో పదివేల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని లోకేశ్ చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఏపీ గడ్డపై ఉత్పత్తి అయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా... దేశ అవసరాలకు కూడా ఉపయోగపడనుందని చెప్పారు. ఇలాంటి ప్రాజెక్టులతో విద్యుత్ ఛార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లపై గుంతలను పూడ్చలేకపోయిందని దుయ్యబట్టారు. ఒక్క పెట్టుబడి కూడా తీసుకురాలేకపోయారన్నారు. అలాంటిది, ఇప్పుడు టీసీఎస్, టాటా ఎనర్జీతో పాటు పలు ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని అన్నారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు.

## తిరుమలలో అత్యున్నత స్థాయి భద్రతకు కార్యాచరణ..

# 14 ప్రవేశ ద్వారాలలో నిఘాకు చర్యలు




తిరుపతి: తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ షెమూషీ భాజ్‌పేయీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ... ఇటీవల పహల్గాం ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో తిరుమల ఆలయంలో భద్రతను మరింత బలోపేతం చేయడమే భద్రతా ఆడిట్ ఉద్దేశం అని పేర్కొన్నారు. అన్ని భద్రతా దళాలు, టీటీడీ విభాగాల సమన్వయంతో పనిచేస్తూ, భక్తుల మనోభావాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. అంతకు ముందు టీటీడీ ఇన్‌ఛార్జి సీవీఎస్ఓ, తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు 2023 మే నెలలో నిర్వహించిన భద్రతా ఆడిట్ సమీక్షలో చేసిన ప్రతిపాదనలు, అలాగే ఇటీవల ఏర్పడిన పరిస్థితుల ఆధారంగా చేపట్టాల్సిన మార్పులు అనే విషయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సుదీర్ఘ వివరణ ఇచ్చారు. అలాగే ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోం గార్డులు, సివిల్ పోలీసు, టీటీడీ భద్రతా సిబ్బంది వంటి అన్ని భద్రతా దళాలను సమన్వయ పరచి ప్రతి ఒక్క దళానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా అన్ని యాక్సెస్ కంట్రోల్ బృందాలకు తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తలకోన, మామండూరు, తుంబురు తీర్థం, మంగళం మార్గాలు సహా శేషాచల అటవీ ప్రాంతానికి చెందిన 14 ప్రవేశ ద్వారాలలో భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రేహౌండ్స్ (కమాండర్) ఎస్పీ డా. గరుడ్ సుమిత్ సునీల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ అరిఫ్ హఫీజ్, తిరుపతి డీఎఫ్ఓ వివేక్ ఆనంద్, వివిధ భద్రతా దళ అధికారులు, టీటీడీ విజిలెన్స్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు..



రాజన్న సిరిసిల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్, వరి ధాన్యం కొనుగోలుపై మంత్రులు, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలుకి సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డ వడ్లు కొనుగోలు చేస్తుంది అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని పేర్కొన్నారు. అయితే, అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా.. చర్యలు తీసుకోవడంతో పాటు పేమెంట్ ఆలస్యం కాకుండా వెంట వెంటనే రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బంది కలిగితే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయండి అని సూచించారు. కానీ, రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు అని కోరారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.. పంట ఎండి పోయిందనే అవకాశం లేకుండా విద్యుత్ ఇబ్బందులు లేకుండా, నీటిని వాడుకుంటూ పంటలు కాపాడుకున్నాం అన్నారు. ఎందుకంటే, మాది రైతుల ప్రభుత్వం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

## మెగా డీఎస్సీ గడువు పొడిగింపుపై

# మంత్రి లోకేశ్ కీలక వ్యాఖ్యలు

అమరావతి: మెగా డీఎస్సీ ద్వారా ఏపీ ప్రభుత్వం 16, 347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనుంది. ఇందుకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ గురువారంతో ముగిసింది. జూన్ 6 నుంచి పరీక్షలు జరగనున్నాయి. అయితే, ప్రిపరేషన్‌కు 90 రోజుల గడువు ఇవ్వాలని చాలా మంది అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. డీఎస్సీ ప్రకటన చేసినప్పటి నుంచి ఇదే డిమాండ్ వినిపిస్తోంది. తాజాగా ఈ డిమాండ్‌పై ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

"డీఎస్సీ ఆపేందుకు వైసీపీ సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. కొందరు సమయం పెంచాలంటున్నారు. గతేడాది డిసెంబర్‌లోనే మేము సిలబస్ ప్రకటించడం జరిగింది. ఏకంగా ఏడు నెలలు గడువిచ్చాం" అని ఆయన గుర్తు చేశారు. దీంతో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలతో మెగా డీఎస్సీ గడువు పెంపునకు అవకాశం లేదని క్లారిటీ ఇచ్చుటినట్లైంది.

ఏపీ మెగా డీఎస్సీ 2025 పూర్తి షెడ్యూల్ ఇలా..

ఆన్‌లైన్ ఫీజుల చెల్లింపులు, దరఖాస్తుల స్వీకరణ తేదీలు: ఏప్రిల్ 20 నుంచి మే 15 వరకు,మాక్ టెస్ట్‌లు: మే 20 నుంచి, హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ తేదీ: మే 30 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, ఏపీ డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు: జూన్ 6 నుంచి జులై 6 వరకు, ప్రాథమిక కీ విడుదల: అన్ని పరీక్షలు పూర్తయిన రెండో రోజే ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ: ఆ తర్వాత ఏడు రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ, ఫైనల్ కీ: అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన ఏడు రోజుల తర్వాత తుది కీ విడుదల, మెరిట్ జాబితా: ఫైనల్ కీ విడుదల చేసిన 7 రోజుల తర్వాత విడుదల .

# ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలు చూశారు

మొదటి పేజి తరువాయి


"రెన్యూ పవర్ వారి పునరుత్పాదక ఇంధన సముదాయ ప్రారంభోత్సవం... సాహసోపేతమైన నిర్ణయానికి, స్థిరమైన ప్రగతికి చిహ్నం. ఈ చారిత్రాత్మక క్షణంలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ.22వేల కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రాజెక్ట్ రేపటి వెలుగుకు దారి చూపుతుంది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు... ఇది ఒక ఉద్యమం. ఈ రోజు మన కలలకు, భవిష్యత్ తరాలకు వారధి లాంటిది. భూమిపై సూర్యకాంతి, స్వచ్ఛమైన, అమూల్యమైన గాలి లభిస్తున్నపుడు భావితరం కోసం మరోగ్రహం కోసం ఎందుకు ఆలోచించాలి? శిలాజ ఇంధనాల నుండి భవిష్యత్ ఇంధనాల వినియోగం కోసం మేం ముందడుగు వేస్తున్నాం. భావితరాల కోసం ఒక ఉన్నత లక్ష్యంతో పని చేస్తున్నాం" అని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ రంగంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తోందని లోకేశ్ కొనియాడారు. "ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలను చూశారు. చంద్రబాబు గారి మార్గదర్శకత్వంలో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ భారతదేశ హరిత విప్లవానికి బ్లూప్రింట్‌గా మారింది" అని ప్రశంసించారు. కేవలం 8 నెలల వ్యవధిలోనే టాటా పవర్, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్, వేదాంత సెరెంటికా, సెయిల్ ఇండస్ట్రీస్, బ్రూక్‌ఫీల్డ్ వంటి క్లీన్ ఎనర్జీ దిగ్గజాలను రాష్ట్రానికి రప్పించగలిగామని గుర్తుచేశారు.

ప్రాజెక్టు వివరాలు - ఉపాధి అవకాశాలు

అనంతపురంలో రెన్యూ సంస్థ నెలకొల్పనున్న ఈ పునరుత్పాదక ఇంధన కాంప్లెక్స్‌ను రెండు దశల్లో నిర్మించనున్నారు. తొలిదశలో రూ.7 వేల కోట్ల పెట్టుబడితో 587 మెగావాట్ల సౌర, 250 మెగావాట్ల పవన, 415 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి యూనిట్లను ఏర్పాటు చేస్తారు. మొత్తం మీద రూ.22 వేల కోట్ల పెట్టుబడితో 1800 మెగావాట్ల సౌర, 1 గిగావాట్ పవన, 2000 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి యూనిట్లను వివిధ దశల్లో నెలకొల్పుతారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 10,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.

తిరిగి వస్తున్న పరిశ్రమలు - ప్రభుత్వ లక్ష్యాలు

ఐదేళ్ల విరామం తర్వాత రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగం పునరుజ్జీవనం పొందుతోందని మంత్రి లోకేష్ అన్నారు. "గత ప్రభుత్వ హయాంలో పారిపోయిన కంపెనీలన్నీ మళ్లీ ప్రజాప్రభుత్వంలో తిరిగి వస్తున్నాయి. చంద్రబాబు బ్రాండ్ వల్లే రెన్యూ వంటి సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి," అని పేర్కొన్నారు. 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలనేది ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు. వచ్చే నెలలోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలనే లక్ష్యంతోనే ఇటువంటి సంస్థలను ప్రోత్సహిస్తున్నామని, ఇక్కడ తయారయ్యే విద్యుత్ రాష్ట్రంతో పాటు దేశ అవసరాలకు ఉపయోగపడుతుందని వివరించారు. రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకువెళుతోందని, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు ఉన్నాయని కొనియాడారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి, సీఎం చంద్రబాబు విజన్ తోడైందని, ఏపీలో ఏర్పాటు చేస్తున్న ఈ కాంప్లెక్స్ దేశంలోనే అతిపెద్దదని పేర్కొన్నారు. స్థానిక రైతులు సహకరించాలని ఆయన కోరారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాకతో స్థానిక రైతులకు ఎకరాకు రూ.35 వేల వరకు కౌలు లభిస్తుందని, వారి పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



## వక్ఫ్ చట్టం పిటిషన్లపై మే 20న సుప్రీం విచారణ..



**న్యూఢిల్లీ,:**1995 చట్టంలోని ఏవైనా నిబంధనలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన ఏ పిటిషన్‌ని కూడా స్వీకరించబోమని, వక్ఫ్ సవరణ చట్టం-2025 అమలును తాత్కాలికంగా నిలుపుదల కోరుతూ నమోదైన పిటిషన్లను పరిగణలోకి తీసుకునే అంశంపై మే 20న నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు గురువారం తెలిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవై నేతృత్వంలోని డివిజన్ బెంచ్, చట్టంలోని మూడు వివాదాస్పద అంశాలపై మధ్యంతర ఉత్తర్వు అవసరమా..? కాదా..? అనే విషయాన్ని నిర్ణయిస్తుంది. వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ కౌన్సిల్, బోర్డులో ముస్లిమేతరులను నామినేట్ చేయడం, వక్ఫ్ కింద ప్రభుత్వ భూముల్ని గుర్తించడం వంటి వాటిపై పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. అయితే, వీటిని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్లు సుప్రీంకోర్టుని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాన్ని సవాల్ చేస్తున్న పిటిషన్ల తరుపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తున్నారు. కేంద్రం తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తున్నారు. సోమవారం ఉదయం నాటికి తన రాతపూర్వక నోట్‌ని సమర్పించాలని తుషార్ మెహతాని సుప్రీం ధర్మాసనం కోరింది. కోర్టు తీర్పు ఇచ్చే వరకు కొత్త చట్టం ప్రకారం కేంద్రం ఏ వక్ఫ్‌ను డీ-నోటిఫై చేయడానికి, వక్ఫ్ బై యూజర్, ముస్లిమేతరులను వక్ఫ్ కౌన్సిల్‌లో చేర్చడంవంటి వాటిపై చర్యలు తీసుకోదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి హామీ ఇచ్చారు.

## హైదరాబాద్ వాసులకు బిగ్ అలర్ట్..
## భారీ వర్షాలు భీకర గాలులు..
## ఆ సమయంలో బయటకు రావద్దంటూ సూచన



**హైదరాబాద్, :** హైదరాబాద్ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కొన్ని రోజులుగా ఎండలు, కొద్దిగా వానలతో సాగిన వాతావరణం ఇప్పుడు పూర్తిగా మేఘాలతో నిండి కనిపిస్తోంది. ఈ రోజంతా మేఘాలతోనే ఉంది. ఉదయం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉదయం 10 గంటల వరకు కురిసాయి. ప్రధానంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కూకట్ పల్లి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. వర్షానికి తోడు, విపరీతమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈ ఈదురుగాలుల వల్ల కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపోతున్నాయి. రోడ్లపై ఎక్కడిక్కడ చెత్త చెల్లాచెదురుగా ఎగురుతోంది. కొన్నిచోట్ల రేకులు, ప్లాస్టిక్ వస్తువులు, డబ్బాలు, డ్రములు లాంటివి ఎగిరిపడుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే ఈ ఈదురుగాలులతో జాగ్రత్తగా ఉండాలని ఐఎండీ తెలిపింది. ఈ గాలులు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తున్నాయి. గాలిసుడి..70 కిలోమీటర్ల వేగంతో ఉంది. నేడు రోజంతా హైదరాబాద్ పై మేఘాలు దట్టంగా పర్చుకుని ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండ కనిపించడం లేదు. ఇంతలా వాతావరణం మార్పిపోవడానికి కారణం ఆగ్నేయ ఆసియా నుంచి వచ్చిన మేఘాలు..ఇండియాపైకి వచ్చాయి. బలమైన గాలులు కూడా మేఘాలు వచ్చేందుకు కారణమయ్యాయి. సాయంత్రం 6 తర్వాత హైదరాబాద్ అంతటా ఓ మోస్తరు వర్షం కొనసాగుతోంది. అది రాత్రి 10గంటల వరకు ఉంటుంది. ఆ సమయంలో ప్రజలు గాలిని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ఉండాలని బలమైన గాలులు వీస్తాయని ఐఎండీ చెబుతోంది. రాత్రి 10 తర్వాత హైదరాబాద్ లో భారీ వర్షం షురూ అవుతుంది. రాత్రి 12గంటలకు వర్షం మరింత ఎక్కువగా అవుతుంది. ఆ సమయంలో ప్రజలు రోడ్లపై పెద్దగా తిరగరు..కాబట్టి ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఉండదు. కానీ భారీ వర్షాల రోడ్లపై నీరు ప్రవహించే ఛాన్స్ ఉంటుంది. ఈ వర్షం 16వ తేదీ తెల్లవారుజామున4 గంటల వరకు కురుస్తుంది. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ చెబుతోంది.

## నష్టాన్ని పూడ్చాల్సిందే, లేదంటే సీఎస్ జైలుకే
## కంచ గచ్చిబౌలిపై సుప్రీం..!!



**హైదరాబాద్, :** సంచలనంగా మారిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్? జైలుకు వెళ్లాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది. సీఎస్? తో పాటు కార్యదర్శులూ జైలుకు పోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. లాంగ్? వీక్? ఎండ్? చూసి ఎందుకు చర్యలు చేపట్టారని అధికారులను అడిగింది. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చాల్సిందేనని స్పష్టం చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం కీలక వ్యాఖలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించిన ధర్మాసనం హెచ్చరించింది. కాగా సీఈసీ దాఖలు చేసిన అఫిడవిట్‌పై కౌంటర్ వేసేందుకు కొంత సమయం కావాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. దీంతో జులై 23వ తేదీలోపు గతంలో ఉన్నట్లుగా అక్కడ పర్యావరణాన్ని పునరుద్ధరించాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంటూ తదుపరి విచారణ జులై 23 వ తేదీకి వాయిదా వేసింది. అలాగే విద్యార్థులపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలంటూ దాఖలైన ఐఏను సుప్రీంకోర్టు త్రోసి పుచ్చింది. ఆ విషయంలో ప్రత్యేకంగా మరో పిటీషన్‌ను దాఖలు చేయాలని, ఈ కేసులో కలపకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. గత విచారణ సందర్భంగా పర్యావరణ వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెబుతూ.. నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు యధాస్థితి కొనసాగించాలని పేర్కొంది. ఈలోగా ఒక్క చెట్టు కూడా నరకడానికి ఒప్పుకోమని స్పష్టం చేసింది. విచారణ ప్రారంభంలోనే వివరాలను పరిశీలించిన సీజేఐ తెలంగాణ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇష్టానుసారంగా డజన్ల కొద్దీ బుల్డోజర్లతో చెట్లు తొలగించేందుకు వినియోగించారని, ఇదంతా ముందస్తు పథకం ప్రకారమే చేసినట్టుగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా.. లేదా అన్నది స్పష్టం చేయాలన్నారు. జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలని జస్టిస్ గవాయ్ అన్నారు.

## యాదాద్రికి పోటెత్తుతున్న భక్తులు.. తగిన సౌకర్యాలు లేక తిప్పలు

**హైదరాబాద్,:**యాదాద్రి భువనగిరి: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదగిరిగుట్ట కొండకు వచ్చే భక్తులకు సరైన సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల యాదాద్రి దర్శనానికి వచ్చే భక్తులకు కొరవడిన రవాణా సౌకర్యంతో పాటు, భద్రతా సిబ్బంది వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి సెలవులు కావడంతో దైవ దర్శనం కోసం భక్తులు యాదాద్రికి పోటెత్తుతున్నారు. దర్శన సమయంలో భక్తులు కిటకిటలాడుతున్నారు. ఈ సమయంలో భక్తుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. దీనికి తోడు భక్తుల రద్దీకి తగ్గట్లు రవాణ సౌకర్యం లేదని, దైవదర్శనంలో భక్తులు వాగ్వాదినికి దిగుతున్నా పోలీసు సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీనికి తోడు భక్తుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడపడంలో అధికారుల విఫలమవుతున్నట్లు సమాచారం.బస్సు సౌకర్యం లేకపోవడం, ఆటోవాలా దోపిడీ ఎక్కువైందని, తగిన సౌకర్యాలు కల్పించాలని పలువురు భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# 'శాంతిదూత' ట్రంప్!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంత సులభంగా అర్థం కారని ఆయన గల్ఫ్ దేశాల పర్యటన తీరుతెన్నులు చూస్తే తెలుస్తుంది. తాను అధికారంలోకొస్తే పశ్చిమాసియాలో సాగుతున్న 'అంతూ దరీ లేని యుద్ధాలకు' ముగింపు పలుకుతానని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆయన తరచు అనే వారు. ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగు రోజుల గల్ఫ్ పర్యటనలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు గమనిస్తే ఆ వాగ్దానాన్ని ఆయన నెరవేర్చదల్చుకున్నట్టు కనబడుతోంది. తన రెండో దశ పాలనలో ట్రంప్ మొదలెట్టిన తొలి విస్తృత విదేశీ పర్యటన ఇది. ఈ ప్రాంతంలోనే ఉన్న ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లకపోవటం ఆయన తాజా వైఖరికి సంకేతం. ఇది ఎన్నాళ్లుంటుందన్నది తెలియక పోయినా చేస్తున్న ప్రకటనలైతే భిన్నంగా ఉన్నాయి. ఇరాన్‌తో అమెరికా 46 ఏళ్లుగా సాగిస్తున్న 'అప్రకటిత యుద్ధం' ఇక కొనసాగనీయరాదన్న అభిప్రాయం ఉందని మంగళవారం సౌదీ అరే బియాలోని రియాద్‌లో ఆయన ప్రకటించారు. బుధవారం సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షారాతో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకొనాలని సలహా ఇచ్చారు. అల్-షారాకు గతంలో అల్ కాయిదాతో, ఐఎస్‌తో సంబంధాలుండేవి. ఈ భేటీకి ముందే గల్ఫ్ సహకార మండలి(జీసీసీ) సదస్సులో సిరియాపై ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు తెలియజేశారు. ఈ నిర్ణయాలపై ఇజ్రాయెల్ అలిగినా, మరొకరు అభ్యంతర పెట్టినా ఆయన ఖాతరు చేయదల్చుకున్నట్టు లేరు. గత నెలలో ట్రంప్‌ను కలిసి సిరియాపై ఆంక్షలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వేడుకున్నారు. ఇరాన్ విషయంలో అయితే చాలా చెప్పివుంటారు. సిరియాపై ఆంక్షలు ఎత్తేయటం, ఇరాన్‌తో చెలిమికి సిద్ధపడటం నెతన్యాహూకు ససేమిరా ఇష్టం లేదు. కానీ లీకుల ద్వారా తప్ప నేరుగా తన అసమ్మతిని ఇంతవరకూ తెలియజేయలేదు. ఆ మధ్య ట్రంప్ ఇందుకు భిన్నంగా మాట్లాడారు. అణు ఒప్పందాన్ని అంగీకరించి, శాంతికి సిద్ధపడకపోతే ఇరాన్ భారీ స్థాయి ఒత్తిడులు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కానీ ట్రంప్ తాజా ధోరణి అందుకు భిన్నంగా ఉంది. ఇరాన్‌తో చెలిమి గురించి ఆయన ఏదో మాటవరసకు అనలేదు. 'ప్రస్తుతం అమెరికాకు అత్యంత సన్నిహిత దేశాలు కొన్ని తరాల కిందట మాపై శత్రుత్వంతో చెలరేగినవే' అని గుర్తుచేశారు. సిరియా, ఇరాన్‌ల విషయంలో తన వైఖరి మారటానికి సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ కారణమని ఆయన జీసీసీ వేదికపైనే ప్రకటించారు కూడా. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతూనే ఉన్నా ఈనెల 5న వారితో అవగాహనకొచ్చారు. స్నేహంలోనైనా, శత్రుత్వంలోనైనా ట్రంప్ తీరే వేరని ఆయన నిర్ణయాలు తెలియజేస్తున్నాయి. మూడేళ్లనాడు అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సౌదీ వచ్చినప్పుడు దేశంలో మానవహక్కులు అడుగంటుతున్న వైనంపై సౌదీ యువరాజును నేరుగా ప్రశ్నించారు. 2018లో జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి ప్రాణం తీయించడాన్ని ప్రస్తావించారు. ఈ మాదిరి హత్యలు తమకు సమ్మతంకావని చెప్పారు. అందుకే కావొచ్చు... ఇప్పుడు ట్రంప్‌కు ఎదురైన స్వాగతసత్కారాల వంటివి బైడెన్‌కు లభించలేదు. సౌదీ గడ్డపై గతకాలపు అమెరికా అధ్యక్షుల్ని నిశితంగా విమర్శించటానికి ట్రంప్ వెన కాడలేదు. అమెరికన్ సమాజం గురించి కాస్తయినా తెలియనివారు ఎంతో జటిలమైన గల్ఫ్ సమా జాల్లో జోక్యం చేసుకోవటానికి ఎగబడ్డారని వ్యాఖ్యానించటం చిన్న విషయం కాదు. పశ్చిమాసియా దేశాలతో ఎన్ని వేల కోట్ల డాలర్ల ఒప్పందాలు కుదుర్చుకోగలమన్నదే ఆయన ఆరాటంగా కనబడు తోంది. దానికి తగ్గట్టే మంగళవారం సౌదీతో 14,200 కోట్ల డాలర్ల మేర ఆయుధ ఒప్పందంపై సంతకాలయ్యాయి. ఇదిగాక అమెరికాలో 60,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు యువరాజు ప్రకటించారు. ట్రంప్ దీంతో సంతృప్తిపడలేదు. దీన్ని లక్ష కోట్ల డాలర్లకు పెంచాలని ఆ వేదికపైనుంచే కోరారు. సౌదీతో అమెరికాకు ఎప్పుడూ మంచి స్నేహసంబంధాలేవున్నా ఈ స్థాయి ఒప్పందాలెప్పుడూ లేవు. ఒక పరిశోధక సంస్థ నివేదిక ప్రకారం 2010-20 మధ్య అమెరికాకు సౌదీతో 10,000 కోట్ల డాలర్ల విలువైన ఆయుధ ఒప్పందాలు మాత్రమే కుదిరాయి. స్నేహం పేరుతో అమెరికాను దోచుకుంటున్నారని నాటో భాగస్వామ్య దేశాలైన పాశ్చాత్య మిత్రులపై తరచూ విరుచుకుపడే ట్రంప్...పశ్చిమాసియా దేశాలకు ఏ కష్టమొచ్చినా అమెరికా దృఢంగా నిలబడుతుందని హామీ ఇవ్వటం గమనార్హం. ఇంధన అవసరాల్లోనూ, రక్షణరంగంలోనూ పనికొచ్చే అత్యంత విలువైన లిథియం, కోబాల్ట్‌లతోపాటు థోరియం వంటి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అన్వేషించి అమెరికా చేర్చటానికి సౌదీ%-%అమెరికా ఖనిజ సంస్థల మధ్య ఈ పర్యటనలో 900 కోట్ల డాలర్ల ఒప్పందం కుదరటంతో ట్రంప్ సంతోషానికి పట్టపగ్గాల్లేవు. అందువల్లే పశ్చిమాసియాకు శక్తి మంతమైన సెమీ కండక్టర్ చిప్స్, ఏఐ డేటా సెంటర్లకు పనికొచ్చే కీలక విడిభాగాల ఎగుమతులకు ఆయన పచ్చజెండా ఊపారు. ఇది సంప్రదాయ అమెరికా విదేశాంగ విధానానికి భిన్నం. ఈ పర్యటనలో ట్రంప్ స్వకార్యమూ నెరవేర్చుకుంటున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దేశ ప్రయోజనాలకూ, అధ్యక్షుడిగా ఆయన నిర్ణయాలకూ చుక్కెదురన్నది విమర్శకుల వాదన. ట్రంప్ సొంత సంస్థకు సారథ్యం వహిస్తున్న ఆయన కుమారులు గత కొన్నివారాలుగా గల్ఫ్‌లో తిష్ఠ వేసి తమ సంస్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారనీ, కుదిరిన ఒప్పందాలన్నీ వారికి మేలు కలిగించేవేననీ అంటున్నారు. ఏది ఏమైనా ట్రంప్ వైఖరి మళ్లీ మారేలోగా పశ్చిమాసియా చక్కబడితే ప్రపంచానికి అంతకన్నా కావాల్సిందేమీ లేదు.

# కాల్పుల విరమణ వ్యూహమా? ఒత్తిడినా?




పహల్గాం ఉగ్రదాడి భారతదేశ ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపరిచింది. అమాయకులైన పర్యాటకులను మతం పేరు అడిగి మరీ చంపిన విధానాన్ని దేశం జీర్ణించుకోలేకపోయింది. దేశవ్యాప్తంగా ఆందోళనలు, ఆవేదనలు వెల్లువెత్తాయి. ఈ దాడికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఉగ్రవాద స్థావరాలపై సంచలనాత్మక ప్రతీకార చర్యగా నిలిచింది. శత్రు శిబిరాల్లోని వందకు పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టడం ద్వారా భారత సైన్యం తమ నిపుణతను, ధైర్యాన్ని మరోసారి నిరూపించింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే క్రమంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలు ఒక్కటైన తీరు, రాజకీయాలను వీడి ఏకమైన నాయకుల ప్రవర్తన, ప్రతి భారతీయుడి గుండె చప్పుడులో ఉగ్రవాదాన్ని అణచివేయాలనే ఆకాంక్ష, అన్ని కలిసి దేశంలో జాతీయ చైతన్యాన్ని రగిలించాయి. కానీ, పరిస్థితి ఇక్కడితో ఆగలేదు. సరిహద్దుల్లో పాకిస్తాన్ కాల్పులకు తెరలేపింది. పాకిస్తాన్ ప్రతీ ఒక్క దాడికి భారత సైన్యం అనూహ్య ధైర్యంతో, సమర్థవంతంగా బదులిచ్చింది. ఈ పరిణామాల వల్ల రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉధృత స్థాయికి చేరాయి. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగితే, రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధం తప్పదేమోననే భావన అంతర్జాతీయంగా ఆందోళన వెల్లువెత్తాయి. ప్రపంచంలోని దేశాలన్నీ భారత్ -పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఈ ఉద్రిక్తతలు ఎంతవరకు వెళతాయేమోనని ఆందోళన చెందాయి. ఇటువంటి ఉద్విగ్న వాతావరణంలో 'కాల్పుల విరమణ' అనే ప్రకటన ఒక్కసారిగా వినిపించడం దేశప్రజలకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇది భారత్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయమా? లేక అంతర్జాతీయ ఒత్తిడికి స్పందనగా వచ్చిన ఫలితమా? అనే సందేహాలు, అనుమానాలు దేశ మొత్తం విస్తరించాయి. దేశ ప్రజలలో నెలకొన్న ఈ సందేహాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ మరింత బలపరిచింది. ఆయన ట్వీట్ కాల్పుల విరమణలో అమెరికా పాత్ర ఉందన్న ఊహాగానాలకు ఊపునిచ్చింది. అమెరికా అధినేత ఈ పరిణామాల్లో భాగం కావడం అనుమానాలకు తావిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో 2025 మే 12న, భారత్ పాకిస్తాన్ మధ్య డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ) స్థాయిలో హాట్‌లైన్ ద్వారా కీలక చర్చలు జరిగాయి. ఈ చర్చలలో ప్రధానంగా చర్చించబడిన అంశాలు, పూర్తి కాల్పుల విరమణ: లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద రెండు దేశాలు కాల్పులు జరగకుండా పరస్పర అంగీకారానికి వచ్చాయి. సైనికుల తగ్గింపు: సరిహద్దు, ముందస్తు ప్రాంతాలలో సైనికుల సంఖ్యను తగ్గించే చర్యలను వెంటనే అంగీకరించారు. శాంతి, స్థిరత్వం: పరస్పర శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు, ఎటువంటి శత్రుత్వ చర్యలు లేకుండా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ చర్చలు, 2025 మే 10న ప్రారంభమైన కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించేందుకు, సరిహద్దు ప్రాంతాలలో శాంతిని పునరుద్ధరించేందుకు కీలకంగా ఉన్నాయి. అయితే, ఈ డిజిఎంఒల చర్చల తర్వాత కొన్ని గంటల్లోనే, లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద కాల్పులు జరిగాయనే వార్తలు కొన్ని వచ్చాయి. భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణ ఉల్లంఘించిందని ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను పాకిస్తాన్ ఖండించింది. ప్రస్తుతం పరిస్థితి సున్నితంగా ఉంది, రెండు దేశాలుపరస్పరం శాంతిని కాపాడేందుకు చర్చలు కొనసాగిస్తున్నాయి. ఈ చర్చలు మొదటి దశ మాత్రమే. భారత్- పాకిస్తాన్ మధ్య జరిగిన చర్చలు, రెండు దేశాల మధ్య మారుతున్న దృక్పథానికి సంకేతంగా భావించవచ్చు. ఈ చర్చలు ఒక సానుకూల సంకేతంగా కనిపిస్తున్నా వీటి వెనక దాగిన మౌలిక ఉద్దేశం ఏమిటో స్పష్టంగా తెలియడం లేదు. యుద్ధ వాతావరణం నుండి చర్చల దశకు జరిగిన ఈ మార్పు ఒక ఊరట నిచ్చే అంశమే. అయితే, ఈ మార్పు తాత్కాలిక శాంతికి సంకేతమా? లేక దీర్ఘకాలిక సుస్థిరతకు మార్గనిర్దేశమా? అనే ప్రశ్నలకు స్పష్టత రావాల్సి ఉంది. ఇక్కడే మన భారత ప్రధాని నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ప్రాధాన్యతను సంతరించుకుంది. 2025 మే 12న జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై తీవ్రంగా స్పందించారు. ఆ దాడిలో అమాయక ప్రజల ప్రాణాలు పోవడం దేశాన్ని కలిచివేసిందని పేర్కొన్నారు. దానికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని, భారతదేశ సైనికుల వీరత్వానికి నిదర్శనమని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని, భవిష్యత్తులో కూడా దేశ భద్రతకు భంగం కలిగించే శక్తులపై భారత్ తగిన తీరులో స్పందిస్తుందని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పాకిస్తాన్ కఠిన పరిణామాలకు సిద్ధంగా ఉండాలని మోడీ స్పష్టంగా హెచ్చరించారు. శాంతి కోసం మన ప్రయత్నం కొనసాగుతుంది, కానీ దేశ భద్రతకు భంగం కలిగించే ఎవ్వరినీ విడిచిపెట్టం అనే ప్రధాని మోడీ సందేశం ఒక వైపు శాంతికి మద్దతు ఇస్తూనే, మరోవైపు దేశరక్షణ విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గబోమనే సంకేతాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. శాంతికి మద్దతు, భద్రత విషయంలో రాజీ లేదు అనే ప్రధాని సందేశం మలిదశ చర్చలకు గట్టి పునాది వేసిందని చెప్పవచ్చు. ఈ మొత్తం పరిణామాలను సమగ్రంగా విశ్లేషిస్తే, కాల్పుల విరమణ వెనక వ్యూహాత్మక స్పష్టత ఉందా? లేక అంతర్జాతీయ ఒత్తిడికి లోబడి తీసుకున్న తాత్కాలిక నిర్ణయమా? అనే సందేహం ప్రజల మనసుల్లో ఇంకా మిగిలే ఉంది. శాంతి అత్యవసరం అయినా, అది స్థిరంగా నిలవాలంటే స్పష్టమైన దిశానిర్దేశం, బలమైన కార్యాచరణ అవసరం. శాంతి పేరుతో మౌనంగా తలవంచడం భవిష్యత్‌కి ప్రమాదకరంగా మారవచ్చు. శాశ్వత శాంతికి ధైర్యవంతమైన నిర్ణయాలు, ప్రజల రక్షణను కేంద్రీకరించిన వ్యూహం అవసరం. ప్రపంచ ఒత్తిడుల కంటే దేశ భద్రతే ప్రథమ లక్ష్యం కావాలి. యుద్ధం ఉపశమనం ఇవ్వదు, కానీ శాంతి నిలబడాలంటే దానిని భంగం చేసే శక్తులకు భయం కలిగించే సామర్థ్యం మనకు ఉండాలి. బలహీన దేశాల శాంతి ఎప్పుడూ దాడుల అంచులపై నడిచిందని, శాంతి కోసం మూల్యం చెల్లించాల్సి వచ్చిందని చరిత్ర చెబుతుంది. అందుకే, శాంతిని మాటలతో కాదు, శక్తితో రక్షించాలి. శత్రువు మనపై దాడికి ముందు పది మేరలు ఆలోచించాలంటే, మన దగ్గర అగ్ని పేటిక ఉందనే భయం ఉండాలి. %-% అది అణ్వాయుధం కావచ్చు, అధునాతన సైనికశక్తి కావచ్చు, అంతర్జాతీయ మద్దతు కావచ్చు. కనికరం లేకుండా ఉగ్రవాద దేశాలకు ఇవ్వవలసిన సందేశం ఒకటే: 'మన దేశాన్ని తాకడమంటే చితిమంటకు ఆహ్వానం' పలకడమని. జై భరత మాత.

# పిఒకె మనకు దక్కుతుందా?




పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి సాధించుకోవాలన్న పట్టుదలతో భారత ప్రభుత్వం ఉంటోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడం మినహా మరో విషయం లేదని, అంతకు మించి మాట్లాడేది లేదని స్పష్టం చేసింది. కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చొరవ చూపించినా దానికి భారత్ ఒప్పుకోవడం లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని కరాఖండీగా చెప్పింది. చారిత్రాత్మకంగా ఒకప్పుడు కశ్మీర్ రాచరిక రాష్ట్రంలో భాగమైన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)ను 1947లో పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. 1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు భారతదేశంలో లేదా పాకిస్థాన్‌లో చేరడం లేదా స్వతంత్రంగా ఉండటం అనే ఎంపికకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు (%ఝంష్ట్రఎఱతీ ర్శీతీఎ% ) బ్రిటిష్ వారు అవకాశం కల్పించారు. ఆ సమయంలో జమ్మూకశ్మీర్ పాలకుడు మహారాజు హరిసింగ్ స్వతంత్ర రాజ్యంగా ఉండాలనే హోదాను ఎంచుకున్నారు. అయితే 1947లో పూంచ్‌లో హరిసింగ్ ఆ ప్రాంత రైతులపై విధించిన శిక్షాత్మక పన్నుల కారణంగా తిరుగుబాటు తలెత్తింది. అదే సంవత్సరం అక్టోబర్‌లో వాయువ్య సరిహద్దు ప్రావిన్స్‌కు చెందిన వేలాది మంది పష్టున్ గిరిజనులు మహారాజా పాలన నుంచి జమ్మూకశ్మీర్‌కు విముక్తి కల్పించాలన్న లక్ష్యంతో పాకిస్తాన్ సైన్యం మద్దతుతో పోరాటం సాగించారు. పరిస్థితిని అదుపు చేయడంలో మహారాజా హరిసింగ్ సైన్యం విఫలమైంది.ఫలితంగా తిరుగుబాటుదారులు పూంచ్ జిల్లాలో ఎక్కువ భాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ముజఫరాబాద్, బారాముల్లాలను స్వాధీనం చేసుకోవడంలో విజయం సాధించారు. ఇక చేసేదిలేక భారత ప్రభుత్వ సహాయాన్ని మహారాజా కోరారు. దానికి భారత ప్రభుత్వం ఒక షరతు విధించింది. భారతదేశంలో జమ్మూకశ్మీర్ విలీనం ఒప్పందానికి అంగీకరిస్తూ సంతకం చేయాలని సూచించింది. దాంతో మహారాజు హరిసింగ్ అంగీకరించారు. జమ్మూకశ్మీర్ రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, కమ్యూనికేషన్ నియంత్రణను భారత ప్రభుత్వానికి అప్పగించారు. దీంతో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం సంభవించింది. ఫలితంగా రెండు ప్రాంతాలపై స్థిరనియంత్రణ లభించింది. పాకిస్తాన్ మద్దతుగల తిరుగుబాటుదారుల ప్రభావంలో ఉన్న ప్రాంతం పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌గా ఇప్పుడు పిలవబడుతున్నది. పేరుకే స్వయం పరిపాలనా ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పాకిస్తాన్ పరిపాలిస్తోంది. పాకిస్తాన్ ఈ ప్రాంతాన్ని ఆజాద్ కశ్మీర్‌గా వ్యవహరిస్తోంది. దీనికి సరిహద్దులుగా ఉత్తరాన గిల్గిట్ బల్టిస్థాన్ (గిల్గిట్ బల్టిస్థాన్ ఆజాద్ కశ్మీర్‌లో భాగం కాదు). దక్షిణాన పాకిస్తాన్ పంజాబ్, పశ్చిమాన ఖైబర్ పఖ్తూన్‌క్వాలు ఉన్నాయి. తూర్పు వైపున జమ్మూకశ్మీర్ ఉంది. ఈ రెండింటి మధ్య నియంత్రణ రేఖ (ఎల్ఒసి) ఉంది. ఇది భారత, పాకిస్తాన్ మధ్య వాస్తవ సరిహద్దుగా పనిచేస్తుంది. భౌగోళికంగా ఈ భూభాగం మొత్తం వైశాల్యం 13,297 కి.మీ (5134 చదరపు మైళ్లు). ముజఫరాబాద్ నగరం దీని రాజధాని. 2017 జాతీయ జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభా 40,45,366. దాదాపు జనాభా అంతా ముస్లింలే. పిఒకెలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. అధ్యక్షుడు రాజ్యాంగబద్ధమైన దేశాధినేత కాగా, ప్రధాన మంత్రి, మంత్రుల మండలి మద్దతుతో కార్యానిర్వాహకత్వం వహిస్తారు. ఏకసభ లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రధాన మంత్రి, రాష్ట్రపతి ఇద్దరినీ ఎన్నుకుంటుంది. స్వంత సుప్రీం కోర్టు, హైకోర్టు ఉన్నాయి. అయితే పాకిస్తాన్ ప్రభుత్వ కశ్మీర్ గిల్గిత్ బాల్టిస్థాన్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, పాకిస్థాన్ ప్రభుత్వానికి, పిఒకె ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా పనిచేస్తుంది. అయితే దీనికి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేదు. పిఒకెలోని ఉత్తరభూభాగం తరచుగా తీవ్ర భూప్రకంపనాలకు గురవుతుంది. 2005లో సంభవించిన భారీ భూకంపం వల్ల లక్షమంది మృతి చెందగా, మరో 30 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. దీనివల్ల ఈ ప్రాంతం మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థ విధ్వంసమయ్యాయి. వ్యవసాయం, పర్యాటకం, సేవలు పైనే ఈ ప్రాంతం ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. ఒకవంక పాకిస్తాన్, మరోవంక విదేశీ సాయాలతోనే పిఒకె మనుగడ సాగిస్తోంది. దాదాపు 87% పిఒకె కుటుంబాలకు వ్యవసాయ భూములు ఉన్నాయి. పిఒకెలో ద్రవ్యోల్బణ ఒత్తిడి ఎక్కువగానే ఉంది. దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు తలెత్తుతున్నాయి. పాకిస్తాన్ ప్రభుత్వ ఉదారవాద విధానాలు, నిరుద్యోగం, అధిక వలసలు ఇవన్నీ తీవ్ర సమస్యలుగా వెంటాడుతున్నాయి. నిరుద్యోగ రేటు 33% వరకు ఉంది. ఉపాధి కోసం యువత గల్ఫ్‌దేశాలకు వలసపోతున్నారు.గత కొన్ని రోజులుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటం, పిఒకెలో ఉన్న వనరులను స్థానిక ప్రజలకు కాకుండా పాక్‌లోని ఇతర ప్రాంతాలకు ప్రభుత్వం తరలించుకుపోతుండడంతో స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోంది. ఇక్కడి జలవిద్యుత్‌ను పాకిస్థాన్‌లోని ఇతర ప్రాంతాలు, నగరాలకు సరఫరా కోసం తరలిస్తున్నారని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. హక్కుల కోసం ప్రజలు వీధికెక్కుతున్నారు. ఈ పరిణామాలన్నీ పిఒకెపై పాకిస్థాన్ ప్రభుత్వ పట్టుకోల్పోడానికి దోహదం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ గమనించి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తమ పాలన లోకి తెచ్చుకోవాలని భారత ప్రధాని మోడీ ఆకాంక్షిస్తున్నారు. అంతేకాదు చర్చల్లో ఇదే ప్రధాన అజెండాగా నిలుస్తోంది.

# గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

810 గ్రాముల గంజాయి చాక్లెట్లు స్వాధీనం



ఆదిభట్ల, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 16: గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే తుర్కయంజాల్, కమ్మగూడ రోడ్డులో పాన్ షాప్ నిర్వహిస్తున్న రాజస్తాన్ నివాసి శ్రవణ్ కుమార్. 4 నెలలుగా రాజస్తాన్ నుండి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి పాన్ షాప్ లో లేబర్లకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో టిసిఎస్ లో హౌస్ కీపింగ్ పనులు చేస్తూ టిసిఎస్ వెనుకవైపు రేకుల షెడ్ లో నివాసం ఉంటున్న ఒరిస్సాకు చెందిన అజిత్ సర్దార్ తో పరిచయం ఏర్పడి, ఇద్దరు కలిసి గంజాయి చాక్లెట్ల వ్యాపారం చేద్దామని ఒక నిర్ణయానికి వచ్చారు. గంజాయి చాక్లెట్లు రాజస్తాన్ నుండి తీసుకొని వచ్చి బినోద్ సర్దార్ అనే వ్యక్తికి ఇస్తే తాను తన చుట్టుపక్కల నివాసం ఉండే లేబర్ లకు అమ్మడానికి ఇద్దరు కలిసి ప్లాన్ చేసుకున్నారు. తమ ఒప్పందం ప్రకారం తేదీ: 14.05.2025 సాయంత్రం 04.30 గంటల ప్రాంతంలో 5 డబ్బాలలో సుమారు 810 గ్రాముల గంజాయి చాక్లెట్లను శ్రవణ్ కుమార్ రాజస్తాన్ నుండి తీసుకొని వచ్చి నాదర్గుల్ ఇండస్ట్రియల్ ఏరియా, టాటా అడ్వాన్స్ సిస్టమ్ దగ్గర వినోద్ సర్దార్ కు ఇస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిబట్ల పోలీసు స్టేషన్ ఎస్ ఐ వెంకటేష్ తన సిబ్బందితో వారి ఇద్దరినీ అరెస్ట్ చేసి గంజాయి చాక్లెట్లను సీజ్ చేసి కోర్టుకు తరలించామని సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్ల వెంకట్ రెడ్డి.



దేవరకొండ, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 16: దేవరకొండలో శుక్రవారం నియోజకవర్గ సిపిఐ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి నూనె వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలతో కష్టపడి పండించిన పంట నీటిపాలు అవుతూ రైతుల ఆవేదన చెందుతున్నారని ఐకెపి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు మరింత వేగవంతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయిందని, దేశాన్ని కార్పొరేట్ లకు తాకట్టు పెట్టి దివాళా తీయించిందని అన్నారు. మోడీ నమ్మిన బంటు ఆదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విపక్ష పార్టీల నాయకులపై సిబిఐ, ఈడి లను ప్రయోగిస్తున్న మోడీ ప్రభుత్వం ఆదానీపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వానిది నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని , విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు అండగా నిలిచి సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహ్మ రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు దేప సుదర్శన్ రెడ్డి ,తూము బుచ్చిరెడ్డి ,ఎస్ కనకాచారి, పోలే వెంకటయ్య , ఎం డి మైనుద్దీన్,ఉప్పునూతల వెంకటయ్య, కె. జయ రాములు, బి. అచ్చయ్య పాండురంగారెడ్డి , ఎన్ వెంకటేశ్వర్లు,జె వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి నూనె వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.

# చింతపల్లి సాయి సన్నిధిలో 27 నుంచి అష్టాదశమ వార్షికోత్సవాలు..

వార్షికోత్సవ గోడ పత్రికను ఆవిష్కరించిన ఆలయ చైర్మన్ మంచి కంటి ధనుంజయ.



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 16: చింతపల్లి శ్రీ షిరిడి సాయి దేవాలయంలో ఈనెల 27 నుంచి 29 వరకు జరిగే 18 వ (అష్టాదశమ) వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ మంచి కంటి ధనుంజయ కోరారు. మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో 18 వ అష్టాదశమ వార్షికోత్సవ గోడ పత్రికను ఆవిష్కరించారు. వార్షికోత్సవాలతోపాటు ,పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ముక్కమల. పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శ్రీధర్ స్వామీజీ ఆశీస్సులతో, చండీ ఉపాసకులు కొడకండ్ల .శ్రీరామ చరణ్ శర్మ వారి ఆధ్వర్యంలో, బ్రహ్మశ్రీ శానకొండ .శివ కిరణ్ శర్మ నిర్వహణతో శాస్త్రోకంగా పూజలు జరుగుతాయని,ఆలయ కోశాధికారి ఊరే కృష్ణయ్య , గోశాల ఇన్చార్జ్ కుంభం పుల్లారెడ్డి తడకమళ్ళ శ్రీనివాస్ , గోవిందు యాదగిరి , ఆలయ పూజారులు, భక్తులు తదితరులు ఉన్నారు.

# మాజీ సర్పంచ్ జన్మదినం సందర్భంగా అభిమాని పట్టణ ప్రజలకు అన్నదానం



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే16) : షాద్ నగర్ నియోజకవర్గం,ఫరూక్ నగర్ మండలం పరిధిలోని గంట్లవెల్లి , దేవుని బండ తండా మాజీ సర్పంచ్ కేతావత్ మోహన్ నాయక్ జన్మదినం సందర్భంగా అభిమాని శ్రీ సేవాలాల్ రియల్ ఎస్టేట్ వ్యవస్థాపకుడు గంట్లవెల్లి సుమన్ సర్పంచ్ పై ఉన్న అభిమానంతో ఆయన పుట్టినరోజు సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో దాదాపుగా వంద కు పైగా అన్నం ప్యాకెట్లు వాటర్ బాటిల్ తో రైల్వే స్టేషన్, మెయిన్ రోడ్, పోలీస్ స్టేషన్ ఎదురుగా, ప్రభుత్వ దవాఖాన, బస్టాండ్ ,తదితర ప్రాంతాలలో శ్రమజీవులు, ఆకలితో ఉన్న చిరు వ్యాపారస్తులకు, ఆటో డ్రైవర్లకు అన్నం ప్యాకెట్లు వాటర్ బాటిల్, అందించి సర్పంచ్ కేతావత్ మోహన్ నాయక్ పుట్టినరోజు సందర్భంగా అభిమానాన్ని చాటుకున్నారు. వారు మాట్లాడుతూ.. జన్మదినం, తదితర శుభ దినాలలో కొంతమంది పేదలకు అన్నదానం చేయడం ఎంతో మంచి కార్యక్రమమని అన్నారు. అన్నం పరబ్రహ్మం ఆకలితో ఉన్నవారికి అన్నం వాటర్ ఇవ్వడంతో ఎంతో అదృష్టమని అన్నారు. ఆయనతోపాటు మిత్ర బృందం గంట్లవెల్లి సుమన్, శ్రీను, శివ, వినోద్, రాజు, అరుణ్, నవీన్, శ్రీను, కోటేష్, పాండు, నరేష్, జర్నలిస్ట్ దర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం సేకరణ పై మంత్రులతో కలెక్టర్, అధికారులు వీడియో కాన్ఫరెన్స్



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, సూర్యా టుడే ప్రతినిధి మే 16: శుక్రవారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్ లతో కలిసి యాసంగి ధాన్యం సేకరణపై మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈసారి రాష్ట్రంలో యాసంగి సీజన్లో రికార్డు స్థాయిలో వరి ధాన్యం సాగు అయిందని అన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణను ఓ మహా యజ్ఞంలా భావిస్తూ, రైతుల నుండి ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. సన్నాలకు బోనస్ సైతం చెల్లించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 60.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలను సేకరించడం జరిగిందన్నారు. గడిచిన మూడు సంవత్సరాలలో పోలిస్తే ఈసారి దాదాపు రెట్టింపు స్థాయిలో ధాన్యం సేకరణ జరుపుతున్నామని తెలిపారు. 2022-23 యాసంగిలో 25 .35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగగా, 2023 -24 లో 32 .93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయన్నారు. ఈ ఏడాది యాసంగికి సంబంధించి ఇప్పటికే 49 .53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయ్యిందని వివరించారు. ఇంకనూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెస్తున్నందున కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా ఇంటర్మీడియట్ గిడ్డంగులను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం నిల్వలు తడిసి పోకుండా వాతావరణ పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ముందస్తుగానే రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేయాలన్నారు. మరో రెండు వారాల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగనున్న దృష్ట్యా, ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా సాఫీగా కొనుగోళ్లు పూర్తయ్యేలా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పర్యవేక్షణ జరపాలని, నాణ్యమైన బియ్యం పంపిణీ జరిగేలా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ మంజూరీలు తెలపాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బోగస్ కార్డులు జారీ కాకుండా పకడ్బందీ పరిశీలన జరపాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్



సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్డీఓ పిడి శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, డీఎస్ఓ, సివిల్ సప్లైస్ డీ.ఎం. గోపికృష్ణ, మార్కెటింగ్ శాఖ ఏ.డీ మహ్మద్ రియాజోద్దిన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం

ప్రతి శుక్రవారం బడిబాటలో భాగంగా జూన్ 11 వరకు(పిటీఎం) నిర్వహణ.



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 16: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచడానికి ఉద్దేశించిన ఒక కార్యక్రమం. బడిబాటలో భాగంగా చింతపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పిటిఎం) ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం జూన్ 11 వరకు ప్రతి శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి నీరుడు అంజయ్య తెలిపారు. బడిబాట కార్యక్రమంలో, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలు, మౌలిక వసతులు, ఉచితాలను వివరిస్తారు. ఈ కార్యక్రమంలో, ఇంటింటికీ వెళ్లి బడికి వెళ్లే పిల్లల సంఖ్య తెలుసుకుంటూ, స్కూల్కు వెళ్లని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. అవగాహన కల్పించే అంశాలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సౌకర్యాలు, ఉచిత విద్య, యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం, డిజిటల్ స్మార్ట్ బోర్డ్. నాణ్యమైన విద్యాబోధన. ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన. డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు అందించే విద్యపై అవగాహన కల్పిస్తున్నారు.





ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యార్థుల ప్రవేశాలు


బడిబాట కార్యక్రమం ద్వారా, ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యార్థుల ప్రవేశాలను పెంచడం, ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచడమే కాకుండా, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల గురించి అవగాహన కల్పించాలనే లక్ష్యంతో విద్యాశాఖ కృషి చేస్తోందని, గ్రామాలలోని కుడళ్ళలో ప్రతి శుక్రవారం పేటీఎం కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని మండల విద్యాధికారి అంజయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, కస్తూర్బా గాంధీ పాఠశాల ఎస్ ఓ, టీజీఎమ్ఎస్ ప్రిన్సిపల్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సి ఆర్ పి లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యూనిఫామ్ స్టిచింగ్ కేంద్రాం పరిశీలన



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి మే(16): విద్యార్థులకు చదువుతోపాటు యూనిఫారం ఎంతో అవసరం అని రంగారెడ్డి జిల్లా డిఆర్డీఏ డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ నాన్ ఫామ్ నర్సింహులు అన్నారు. కేశంపేట్ మండల పరిధిలోని కొత్తపేట్ లో డి ఆర్ డి ఏ (క్లస్టర్)ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు యూనిఫామ్ స్టిచింగ్ కేంద్రాన్ని శుక్రవారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఎపియం భగవంతు , సీసీ మల్లేష్ , కొత్తపేట గ్రామ సంఘము అధ్యక్షురాలు లలితమ్మ , వివోఏ నర్సమ్మ , కుట్టుకేంద్రం టైలర్స్ ఖాజా బేగం , మంజుల , పాల్గొన్నారు.

# ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.సిద్దం.ఉజ్వల్ రెడ్డి



సూర్య న్యూస్ ఝరాసంఘం మే 16 : బర్దిపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు శ్రీ.దామోదర రాజనర్సింహ గారి కృషితో మంజూరైన ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి శుక్రవారం దత్తగిరి మహారాజ్ గారితో కలిసి తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా సిద్దం.ఉజ్వల్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు.ముందుగా బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమంలో వేద పండితులు పూర్ణకుంభంతో వేద మంత్రాలతో ఘన స్వాగతం పలికారు అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఝరాసంఘం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్,సిడిసి చైర్మన్ ముబీన్, జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్,మాజీ సోసైటి చైర్మన్,మల్లికార్జున్ రెడ్డి,మల్లన్న పాటిల్,మొగడం పల్లీ మాజీ యం.పి.పి.గుండారెడ్డి, నర్సింహారెడ్డియూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, అశ్విన్ పాటిల్,శ్రీకాంత్ రెడ్డి,హర్షవర్ధన్ రెడ్డి,నథానెయల్, జగదీశ్వర్ రెడ్డి,అక్షయ్ జాడే,సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి,గ్రామ మాజీ సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి,హర్షద్ పటేల్,నర్సింహా యాదవ్,అక్బర్,జుబేర్,ఇమామ్ పటేల్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రైతుల ముంగిట శాస్త్రవేతలు వ్యవసాయంపై అవగాహన



తుర్కయంజాల్-సాయి సూర్య: రసాయన పురుగు మందులు వాడడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సమర్థ నీటి వినియోగం, అటవి వ్యవసాయంపై రైతు ముంగిట శాస్త్రవేతలు కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేతలు డా. యం. సుజాత, డా. వి. సునీత,డా. యం. రాజశేఖర్ పాల్గొని రైతులకు రాబోయే వానాకాలం పంటలలో యాజమాన్యం గురించి అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ గ్రామంలో రైతులకు వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైతు సంక్షేమ సభ్యులు రాములు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. అంతేకాకుండా సంప్రదాయ పంటలతో పాటు ఇతర వాణిజ్య పంటలు సాగు చేసి రైతులు ఆర్థికంగా వృధి చెందాలన్నారు. ముఖ్యంగా తక్కువ యూరియా వాడకం, విత్తన మరియు నేల శుద్ధి, పంట మార్పిడి, రైతులు ఎవి కొన్న రసీదులు జాగ్రత పర్చుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పల్లవి వ్యవసాయ అధికారి , రఘుపతి వ్యవసాయ విస్తరణ అధికారి ఇతర గ్రామ ప్రతినిధులు, రైతులు, యువకులు పాల్గొన్నారు. తప్పకుండా ఒక బస్తా యూరియా తక్కువ వాడుతాం అని ప్రతిజ్ఞ రైతులతో శాస్త్రవేత్ర చేయించారు.



# వ్యాపారుల అక్రమాలపై పీడీ చట్టం

హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం సీజన్లో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 'విత్తనాలు, ఎరువుల అక్రమ దందాపై అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించాలి. రాష్ట్ర సరిహద్దుల్లో నిరంతర నిఘా పెట్టండి' అని నిర్దేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారు. "అన్నదాతలూ... నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. ప్యాకెట్లు తప్ప విడి విత్తనాలు కొనవద్దు. విత్తన ప్యాకెట్లు కొనే సమయంలో తప్పకుండా బిల్లును తీసుకోండి. పంట కాలం ముగిసేంత వరకు ఖాళీ ప్యాకెట్‌లను భద్రపరుచుకోవాలి. జిల్లాల్లో సరిపడా అన్ని కంపెనీల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈసారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో, రాష్ట్రంలో వానలు ముందుగానే కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ చేసిన సూచనలను గమనించాలి. సరైన సమయంలో పంటలు వేసుకోవాలి" అని సీఎం రేవంత్ సూచించారు. 'వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ అన్ని విధాలుగా సన్నద్ధం కావాలి. విత్తనాలు, ఎరువులకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సీఎస్ మాట్లాడాలి. నకిలీ కంపెనీలు, కల్తీ విత్తనాల బారిన పడి రైతులు మోసపోకుండా వ్యవసాయ శాఖ పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలి. ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు.. ఎక్కడ నిల్వలున్నాయి.. ఎక్కడ నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలపై అధికారులకు సమాచారం ఉంది. ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి" అని సీఎం ఆదేశించారు. రైతు భరోసా, పంటల బీమా తదితర పథకాలకు నిధుల అవసరం, వనరుల సమీకరణకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించాలని సీఎం రేవంత్ ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావును ఆదేశించినట్లు తెలిసింది. పథకాలకు గతంలో వెచ్చించిన నిధులపై అధికారులు సమాచారం ఇచ్చారు. వాటిని కొనసాగించేందుకు ఎన్ని నిధులు కావాలనే దానిపై సమాచారం ఇవ్వాలని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. సమీక్షలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఏపిలో 19 ప్రాజెక్టులకు ఎస్ఐపిబి ఆమోదం



అమరావతి : ఏపిలో 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన 6 వ ఎస్ఐపిబి సమావేశం ముగిసింది. 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పెట్టుబడులకు సమావేశంలో ఆమోదం లభించింది. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలకు సంబంధించి పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ముందుకొచ్చాయి. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకొచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు సంబంధించి ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్రస్థాయి పనుల స్థితిగతులను తెలుసుకోవడానికి డాష్ బోర్డు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, గదుల కొరత ఉండటంతో ముఖ్యమంత్రి.. పెద్దఎత్తున హోటల్ రూములు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుందని వ్యాఖ్యానించారు. 50 వేల గదులు అందుబాటులోకి తేవాలి అనేది తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. హోటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారని సిఎం వెల్లడించారు.

## మణిపూర్‌లో 10 మంది ఉగ్రవాదులు హతం



చందేల్ : మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో అస్సాం రైఫిల్స్ యూనిట్ కి, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది ఉగ్రవాదులు మరణించారని అధికారులు తెలిపారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్మీ తూర్పు కమాండ్ ఎక్స్ లో పోస్ట్ చేసింది. "ఇండో-మయన్మార్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న చందేల్ జిల్లా ఖెంగ్‌జోయ్ తహసీల్‌లోని న్యూ సమతాల్ గ్రామం సమీపంలో సాయుధ క్యాడర్ల కదలికలపై నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, స్పియర్ కార్ప్స్ ఆధ్వర్యంలోని అస్సాం రైఫిల్స్ యూనిట్ మే 14న ఆపరేషన్ ప్రారంభించింది" అని తెలిపింది. ఆపరేషన్ సమయంలో జరిగిన కాల్పుల్లో 10 మంది ఉగ్రవాదులు మృతి చెందగా, భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. కోహిమాలో ఉన్న డిఫెన్స్ పిఆర్ఓ గురువారం ఉదయం పిటిఐతో మాట్లాడుతూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని,. అది ముగిసిన తర్వాత వివరాలను తెలియజేస్తామని తెలిపారు.

## అందాల భామలపై నీళ్లు పోస్తే కాళ్లు కడిగినట్టేనా?

### బీఆర్ఎస్‌పై మంత్రి ఫైర్



**హైదరాబాద్, :** తెలంగాణ మహిళలతో అందాల భామల కాళ్లు కడిగిస్తారంటూ బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి ఇది తీవ్ర అవమానకరమని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మిస్ వరల్డ్ పోటీదారులు ములుగు, రామప్ప దేవాలయ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా రామప్ప దేవాలయంలోకి వెళ్లే ముందు అందాల భామలు కాళ్లు కడుక్కుని వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళలు నీళ్లు పోయడం వివాదాస్పదమైంది. తాజాగా ఈ వ్యవహారంపై మంత్రి సీతక్క స్పందిస్తూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో అందాల భామల హెరిటేజ్ వాక్ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ నేతలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కావాలనే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాంక ట్రంప్ హైదరాబాద్ వచ్చినప్పుడు ఆమె వెంట తిరిగిన నాయకుడు ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గిరిజన సంప్రదాయంలో గుడిలోకి వెళ్లే ముందు కాళ్లు కడుగుకొని వెళ్లడం సంప్రదాయం.. అదే అక్కడ పాటించారన్నారు. ఆ సమయంలో ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్ అమ్మాయి.. కాళ్లకు నీళ్లు పోసిందని.. దాన్ని పట్టుకుని నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక వేళ తెలంగాణ ప్రభుత్వం కాళ్లు కడిగిస్తే.. అందరి కాళ్లు కడిగించాలి కదా? కానీ అక్కడ అలా జరగలేదన్నారు. అయినా దాన్ని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? అని బీఆర్ఎస్ నేతలపై ఫైరయ్యారు. కవితమ్మ కాళ్ల దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్లు మొక్కించుకోవడం మీ దుహంకారం కాదా? ఈ తీరు నచ్చకే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారని పేర్కొన్నారు. అసలు తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా? తెలంగాణ పేరునే మీ పార్టీ పేరులో నుంచి తీసేశారు కదా? అని ప్రశ్నించారు. ఈ మధ్య సబితా ఇంద్రారెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని.. ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసన్నారు. వాస్తవాలు మాట్లాడాలని.. అబద్ధాలు కాదని హితవు పలికారు. ఇప్పటికైనా అబద్ధాలకు అంబాసిడర్‌గా సబితమ్మ మారొద్దన్నారు. అధికారం పోయాక ప్రజల ఆత్మగౌరవం గుర్తొచ్చిందా? అంటూ మంత్రి నిలదీశారు.

## సుప్రీంను ప్రశ్నించిన రాష్ట్రపతి.. తప్పుపట్టిన సీఎం స్టాలిన్



న్యూఢిల్లీ: బిల్లుల క్లియరెన్స్ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీంకోర్టు డెడ్‌లైన్ విధించిన విషయం తెలిసిందే. దాన్ని ప్రశ్నిస్తూ ఇవాళ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ .. సుప్రీంకోర్టును ప్రశ్నించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద ఆమె సుప్రీంను వివరణ కోరారు. సుప్రీంను వివరణ కోరిన అంశంపై తమిళనాడు సీఎం స్టాలిన్ స్పందించారు. ఆ రిఫరెన్స్‌ను ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమిళనాడు గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తప్పుదోవ పట్టించినట్లు అవుతుందని సీఎం స్టాలిన్ వెల్లడించారు. బీజేపీ ఆదేశాల ప్రకారమే తమిళనాడు గవర్నర్ తమ రాష్ట్ర బిల్లులను ఆపినట్లు స్టాలిన్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఏజెండ్లు అయిన గవర్నర్ల ద్వారా ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను బలహీన పరిచే ప్రక్రియ జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు నాన్ బీజేపీ రాష్ట్రాలు ఒక్కటి కావాలని ఆయన కోరారు. రాష్ట్రపతి ముర్మ చేసిన రిఫరెన్స్‌కు సమాధానం ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ బిల్లుకు ఆమోదం ఆలస్యం అయితే, అప్పుడు ఆ బిల్లులకు ఓకే చెప్పినట్లేనా అని ఆమె సుప్రీంను ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలతో కూడిన లేఖను రాష్ట్రపతి పంపారు.

# విశాఖలో మాయా లోకం


### రూ.460 కోట్లతో ఈస్ట్‌కోస్ట్ హేబిటేట్ సెంటర్

### 2.82 ఎకరాల్లో వర్చువల్ రియాల్టీ ఎరీనా, త్రీ స్టార్ హోటల్

### పీపీపీ విధానంలో చేపట్టేందుకు కసరత్తు

### ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ దరఖాస్తుల ఆహ్వానం

### మధురవాడలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులకు వీఎంఆర్‌డీఏ ప్రణాళికలు



విశాఖ సిటీ: ఊహకందని అద్భుత ప్రపంచం కళ్ల ముందు సాక్షాత్కరించనుంది. కనివినీ ఎరుగని మాయాలోకం అందరినీ మంత్రముగ్ధులను చేయనుంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేనటువంటి మిథ్యా ప్రపంచం విశాఖ వాసులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. ఇందుకోసం విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. మధురవాడ ప్రాంతంలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. వర్చువల్ వరల్డ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించడానికి 'వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాలిటీ ఎరీనా అండ్ త్రీ స్టార్ హోటల్'తో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్ ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టే ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణకు దరఖాస్తులు ఆహ్వానించింది.

### రూ.470 కోట్లతో హేబిటేట్ సెంటర్

ఆధునిక వాతావరణంలో సంపన్న వర్గాల అభిరుచులకు తగ్గట్టుగా 'ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్'ను నిర్మించాలని వీఎంఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. ఐటీ సంస్థలకు సమీపంలో ఎండాడ లా కాలేజీ నుంచి రుషికొండ రోడ్డులో 8.82 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. పీపీపీ విధానంలో రూ.470 కోట్లతో ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో ఐటీ స్పేస్, బిజినెస్ సెంటర్, రిటైల్ స్పేస్, ఆడిటోరియం, సెమినార్ హాల్, పార్టీ ఈవెంట్స్ లాన్‌లతో పాటు ట్రేడ్ ఫెయిర్లు, ఆర్ట్, కల్చర్ షో, ఎగ్జిబిషన్లకు అనువుగా సౌకర్యాలు కల్పించనున్నారు. అలాగే క్లబ్ హౌస్, అంతర్జాతీయ రుచులతో వంటలు అందించే రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తారు. అలాగే ఇండోర్ యాంఫీ థియేటర్, 400 మంది పట్టేలా కేఫ్‌టేరియా, 600 మంది సౌకర్యంగా కూర్చునే ఫైన్ డ్రైన్ రెస్టారెంట్లు ఉండనున్నాయి. 60 రూములు కలిగిన హోటల్, 250 మందికి సరిపడా ఈవెంట్ లాన్, సూపర్ మార్కెట్, మెడికల్, స్పోర్ట్స్ సెంటర్లు కూడా రానున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆర్ఎఫ్‌పీలు ఆహ్వానించారు. ఈ నెల 20వ తేదీలోగా ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న సంస్థల అర్హతలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నారు. వీలైనంత వేగంగా ఈ ప్రాజెక్టులను పట్టాలెక్కించాలని అధికారులు భావిస్తున్నారు.

### 2.82 ఎకరాల్లో వర్చువల్ ఎరీనా

విశాఖ వాసులకే కాకుండా ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా విశాఖలో వర్చువల్ రియాలిటీ అనుభవాన్ని అందించేందుకు వీఎంఆర్‌డీఏ అధికారులు సరికొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటి వరకు పార్కులు, మ్యూజియాలు, కన్వెన్షన్ సెంటర్లపైనే దృష్టి పెట్టినవారు.. ఇప్పుడు భవిష్యత్తు తరాలకు ఆసక్తికరమైన, ఆకట్టుకునేలా వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా అండ్ 3 స్టార్ హోటల్ నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. ఎండాడ లా కాలేజ్ మార్గంలో 2.82 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. గేమింగ్, వర్చువల్ రియాలిటీ, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ వంటి సాంకేతికత అంశాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో వర్చువల్ రియాలిటీ అనుభవాన్ని పొందేలా 360 డిగ్రీల థియేటర్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూమ్, చారిత్రక యుగాల అనుభవంలోకి తీసుకెళ్లేలా వర్చువల్ టైమ్ ట్రావెల్, వీఆర్ గేమింగ్ జోన్, 350 చదరపు మీటర్ల భారీ అక్వేరియం, 20 మల్టీక్యూజన్ రెస్టారెంట్ అవుట్‌లెట్లు, 10 శాతం కమర్షియల్ అవుట్‌లెట్లతో పాటు 100 రూమ్‌లు, 1000 మంది పట్టేలా ఫంక్షన్ హాల్‌తో త్రీ స్టార్ హోటల్‌ను నిర్మించనున్నారు.

### ఆర్థిక, పర్యాటకానికి అనుగుణంగా..

పర్యాటకాభివృద్ధి కోసమే కాకుండా ఆర్థిక పరిపుష్టికి అనుగుణంగా రెండు కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నాం. ఐటీ సంస్థలకు సమీపంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో వర్చువల్ రియాలిటీ ఎరీనాతో పాటు అర్బన్ హేబిటేట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఇందుకోసం ఆర్ఎఫ్‌పీలు ఆహ్వానించాం. ఇవి ఏర్పాటైతే ప్రపంచ పర్యాటకులకు మంచి అనుభూతిని పంచడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల నిర్వహణకు వేదికలుగా నిలుస్తాయి.

# మన వేలితో మన కన్నే..!

### తుర్కియే నైచ్యానికి పరాకాష్ట

### భారత ముడి పదార్థాలతోనే డ్రోన్లు

### వాటినే పాక్‌కు పంపిన కండకావరం

### సైనికులను కూడా పంపినట్టు వెలుగులోకి



రెండేళ్ల క్రితం భయానక భూకంపం వేళ తుర్కియేకు అందరికంటే ముందు ఆపన్న హస్తం అందించింది భారతే. 'ఆపరేషన్ దోస్త్' పేరిట భారీ సాయం చేసింది. కానీ ఆ దేశం మాత్రం తిన్నింటి వాసాలే లెక్కబెడుతోంది. సాయుధ సంఘర్షణ వేళ దాయాది పాకిస్తాన్‌కు ఎడాపెడా డ్రోన్లు, ఇతర ఆయుధాలను అందజేసి కృతఘ్నుతకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. విశ్వాస ఘాతుకానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. వాటితో పాటు సైనికులను, శిక్షణా సిబ్బందిని కూడా పాక్‌కు తుర్కియే భారీగా పంపినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. డ్రోన్ల వాడకం తదితరాల్లో వాళ్లు పాక్ జవాన్లకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చినట్టు తేలింది. పాక్‌కు తుర్కిష్ కంపెనీ ఆసిస్‌గార్డ్ సోంగార్ పంపిన బైరక్తార్ టీబీ2, ఈహా డ్రోన్లు ఆత్మాహుతి తరహావి. లక్ష్యంపై పడి పేలిపోతాయి. ఈ డ్రోన్ల తయారీలో భారత్ ఎగుమతి చేసే కీలకమైన మూలకాలు, ముడి సరుకులే ప్రధాన వనరులు కావడం విశేషం! మనకు వ్యతిరేకింగా ఇలా నిస్సిగ్గుగా బరితెగించిన తుర్కియేకు ఆ కీలక ఎగుమతులను తక్షణం నిలిపేయాలని రక్షణ నిపుణులు సూచిస్తున్నారు.

### కంట్రోలర్ల నుంచి రిసీవర్ దాకా...

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రశిబిరాలను భారత్ కుప్పకూల్చిన కొద్ది గంటలకే పాక్ దాదాపు 400 డ్రోన్లతో సరిహద్దు ప్రాంతాలపై దాడికి తెగించడం తెలిసిందే. తుర్కియేకు భారత ఎగుమతుల్లో సింహభాగం అల్యూమినియం, అల్యూమినియం సంబంధ ఉపకరణాలు, ఆటో ఉత్పత్తులు, విమానాల విడిభాగాలు, టెలికం ఉపకరణాలు, ఎలక్ట్రిక్ వస్తువులు, పరికరాలు తదితరాలే. వీటిలో చాలావరకు డ్రోన్ల తయారీలో కీలకం. డోన్లలోని కంట్రోలర్, ఫ్రేమ్, మోటార్, ప్రొపెల్లర్, కెమెరా, ఫైట్ కంట్రోల్, రిసీవర్, వీడియో ట్రాన్స్‌మిటర్, యాంటెన్నా, స్పీడ్ కంట్రోలర్, కంట్రోలర్లను కూడా భారత్ నుంచే తుర్కియే దిగుమతి చేసుకుంటోంది. ముఖ్యంగా కరోనా తర్వాత ఈ ఎగుమతులు ఎక్కువచయ్యాయి. ఆ విడిభాగాలతో రూపొందించిన డ్రోన్లను పాక్‌కు అందజేయాలన్నది తుర్కియే అధ్యక్షుడు రెసిప్ తయ్యిప్ ఎర్డోగన్ నిర్ణయమేనని తెలుస్తోంది. అతనికి అంతులేని భారత విద్వేగ్గా పేరుంది. తమ డ్రోన్లు, ఆయుధాలను భారత్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదనే ఒట్టు పెట్టుకున్నారు!

### మన విమానాశ్రయాల భద్రతతుర్కియే సంస్థ చేతుల్లో!

భారత్‌లోని పలు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా అంశాల్లో కూడా తుర్కియే పరోక్షపాత్ర ఉందని వెలుగులోకి వచ్చింది. వాటిలో కార్గో హ్యాండ్లింగ్ వంటి కీలక కాంట్రాక్టులను తుర్కియేకు చెందిన సెలెబీ ఏవియేషన్ కంపెనీ చెందిన అనుబంధ సంస్థ సంపాదించిందని తేలింది. భారత్‌లో 2008 నుంచి ఈ సంస్థ సేవలందిస్తోంది. ఏటా 58,000 విమానాలు, 5.4 లక్షల టన్నుల సరకు రవాణా బాధ్యతలను చూసుకుంటోంది. అందులో 7,800 మంది సిబ్బంది ఉన్నారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబాద్, గోవా, కొచ్చిన్, కన్నూర్ వంటి కీలక విమానాశ్రయాల్లో హై సెక్యూరిటీ బాధ్యతలు సెలెబీవే! గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో మేనేజ్‌మెంట్, ఎయిర్‌సైడ్ ఆపరేషన్స్ విధులను ఈ సంస్థే చూస్తోంది. విమానాలను నిలిపి ఉంచే హై సెక్యూరిటీ జోన్, ఎయిర్‌సైడ్ జోన్లన్నా సంస్థ సిబ్బందే విధుల్లో ఉంటున్నారు. ప్రయాణికుల బ్యాగులు, కార్గో పనులను చూసుకునేదీ వాళ్లే. అంతర్జాతీయ సర్వీసుల్లో కూడా ఈ బాధ్యతలను వీళ్లకే అప్పగించారు. తాజా పరిణామాల నేపథ్యంలో దీనిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆరు దేశాల్లోని 70 విమానాశ్రయాల్లో కూడా సెలెబీ కాంట్రాక్టులు సంపాదించింది.

### ముమ్మరంగా 'బ్యాన్ తుర్కియే'

పాక్‌కు సైనికసాయం చేస్తున్నందుకు నిరసనగా తుర్కియే ఉత్పత్తులను బహిష్కరించాలన్న డిమాండ్లు దేశవ్యాప్తంగా ఊపందుకున్నాయి. ఇకపై తుర్కియే యాపిల్ పండ్లను దిగుమతి చేసుకోవద్దని మహారాష్ట్రలోని కీలకమైన పుణె పండ్ల మార్కెట్ ట్రేడర్లు నిర్ణయించుకున్నారు. "మన సైన్యానికి మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నాం. తుర్కియేకు బదులు ఇక హిమాచల్, ఉత్తరాఖండ్ ఇరాన్ నుంచి ఆపిల్స్ తెప్పిస్తాం" అని పుణె వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీ ట్రేడర్ సుయోగ్ జిందే చెప్పారు. పుణెలో తుర్కియే యాపిల్స్ టర్నోవర్ రూ.1,200 కోట్ల పై చిలుకే. దాంతో ఈ నిర్ణయం ఆ దేశానికి పెద్ద దెబ్బే కానుంది. తుర్కియే నుంచి తెల్ల చలువరాయి దిగుమతులనూ నిషేధించాలన్న డిమాండ్లు విన్పిస్తున్నాయి.

### యాత్రలూ బంద్!

తుర్కియేకు మనోళ్ల విహార యాత్రలు కూడా భారీగా తగ్గాయి. ఆ దేశానికి క్యాన్సలేషన్‌లు భారీగా పెరుగుతున్నాయని ఈజ్‌మైట్రిప్, ఇగ్జిగో వంటి ఆన్‌లైన్ ట్రావెల్ ప్లాట్‌ఫాంలు తెలిపాయి. తుర్కియే ప్రభుత్వ వార్తా చానల్ 'టీఆర్‌టీ' తాలూకు 'ఎక్స్' ఖాతాను కేంద్రం బ్లాక్ చేసింది. టర్కీతో మన వాణిజ్యం కూడా తగ్గుముఖం పడుతోంది. 2024-25 మధ్య తుర్కియేకు మన ఎగుమతులు 5.2 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌కు బాహాటంగా మద్దతు ప్రకటించిన అజర్‌బైజాన్‌కు కూడా ఇదే సెగ తగులుతోంది. దాని రాజధాని బకు ఇటీవలి దాకా భారత పర్యాటకులకు ఫేవరెట్ డెస్టినేషన్లలో ఒకటిగా ఉండేది. ఏటా లక్షలాది మంది అక్కడికి వెళ్లేవారు. బకుకు బుకింగులు కూడా ఇప్పుడు భారీగా తగ్గిపోతున్నాయి.

### జేఎన్‌యూ కటీఫ్

తుర్కియే విద్యాసంస్థలతోనూ తెగదెంపులు చేసుకోవాలనే డిమాండ్‌ల నేపథ్యంలో ఆ దేశంలోని ఇనోను వర్సిటీతో అవగాహన ఒప్పందాన్ని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) రద్దు చేసుకుంది. జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. గత ఫిబ్రవరిలో కుదిరిన ఈ మూడేళ్ల ఒప్పందం ప్రకారం రెండు వర్సిటీల విద్యార్థులు, అధ్యాపకుల మార్పి డికి అవకాశముండేది.

# టార్గెట్లూ- టార్చర్లూ!



తెలుగు రాష్ట్రాల్లో కోడి పందాల సమయంలో అనేక వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. వాటిని నిర్వహిం చొద్దంటూ హైకోర్టు నుంచి ఆదేశాలు, పోలీసుల నుంచి హెచ్చరికలు వస్తుంటాయి. కానీ వాటిల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోవు. యదేచ్ఛగా పందాలు కొనసాగుతాయి. మరుసటిరోజే టీవీల్లో, పేపర్లలో వార్తలొస్తాయి. కానీ వాటిపై ఎవరూ చర్యలు తీసుకోరు. ఇప్పుడు ఇదేవిధంగా ఉన్నాయి ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల తీరుతెన్నులు. వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహించొద్దు, పిల్లలను ఒత్తిడికి గురిచేయొద్దంటూ ప్రభుత్వం, విద్యాశాఖ పదేపదే హెచ్చరికలు జారీ చేస్తుంటాయి. ఈ సంవత్సరం కూడా ఆ పరంపర కొనసాగింది. కానీ హైదరాబాద్ సహా జిల్లాలు, మండల కేంద్రాల్లోని అనేక ప్రయివేటు, కార్పొరేట్ కాలేజీలు సర్కారు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. వార్షిక పరీక్షలు ముగిసిన ఏప్రిల్‌లోనే మళ్లీ పైతరగతుల క్లాసులను ప్రారంభించాయి. ప్రారంభించటమే గాదు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశా లలకు ఫోన్లు చేసి, అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలంటూ లెక్చరర్లను, సిబ్బందిని అవి ఆదేశించటం గమనార్హం. ఈ రకంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆయా కాలేజీలు.. మరోవైపు తమ వద్ద పనిచేసే అధ్యాపకులు, సిబ్బంది మెడపై మరోకత్తిని వేలాదీయటం కలవరపాటుకు గురిచేస్తోంది. 'మీ ఉద్యోగాలు ఉండాలంటే కచ్చితంగా మేం చెప్పిన పనులు చేయాల్సిందే. ఒక్కొక్కరు ఇంటింటికీ తిరిగి పిల్లలను పట్టుకుని రావాలి, అడ్మిషన్లు చేయించాలి, ఫీజులు వసూలు చేసే బాధ్యతను సైతం మీరే తీసుకోవాలి. అలాగని ఒకరో ఇద్దరో పిల్లల్ని తీసుకొస్తే సరిపోదు, కనీసంలో కనీసంగా ఓ పదిహేను మందిని కాలేజీల్లో చేర్పించాలి, లేదంటే మీదారి మీరు చూసుకోవాల్సి ఉంటుంది' అంటూ హుకూం జారీ చేయటం పరిపాటిగా మారింది. దీంతో ఏం చేయాలో పాలు పోక ప్రయివేటు అధ్యాపకులు, సిబ్బంది తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. ఇది ఒకరకమైన వేధింపులైతే.. నాణేనికి రెండోవైపు ఇంకోరకమైన సాధింపులు కొనసాగుతుండటం అధ్యాపకులను మరింత ఒత్తిడిలోకి నెడుతోంది. ఇటీవల విడుదలైన ఇంటర్, ఎమ్‌సెట్, జేఈఈ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థుల ఘనతను తమ ఖాతాల్లో వేసుకుంటున్న యాజమాన్యాలు.. ఫెయిలైన విద్యార్థులు, మార్కులు, ర్యాంకుల్లో వెనుకబాటును మాత్రం లెక్చరర్ల వైఫల్యాలుగా చిత్రీకరిస్తూ వారిని ఆత్మనూన్య తాభావానికి గురి చేస్తుండటం విస్మయకరమైన అంశం. ఆ వైఫల్యాలకు వారిని బాధ్యులను చేస్తూ ఒక బ్రాంచి నుంచి మరోదానికి మారుస్తూ వారి జీవితాలతో ఆటాడుకుంటున్న దృష్టాంతాలు అనేకం వెలుగు చూస్తున్నాయి. ఇవన్నీ ప్రయివేటు, కార్పొరేట్ విద్యారంగంపై ప్రభుత్వ అజమాయిషీ కొరవడిన వైనాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. నియమ నిబంధనలకు విరుద్ధంగా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న ఆయా విద్యాసంస్థలు తమకున్న పలుకుబడిని ఉపయోగించి, ఇష్టానుసారంగా రాజ్యాన్నేలు తున్నాయి. వేలమందికి అడ్మిషన్లు ఇస్తున్న పలు కార్పొరేట్ కాలేజీలు..కొన్ని వందల మందికి మాత్రమే మార్కులు, ర్యాంకులు తెప్పిస్తున్నాయనే విషయాన్ని మనం మరువరాదు. ఆ మార్కులు, ర్యాంకులనే పెద్దపెద్ద హోర్డింగుల ద్వారా ప్రచారార్భాటం చేసుకుంటూ వందల కోట్లను ఆయా సం స్థలు పోగేసుకుంటున్నాయి. మిగతా ఫెయిలైన విద్యార్థుల సంఖ్యను, ఆ సంగతిని ఏమాత్రం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటూ తమ వైఫల్యాలను మరుగుపరుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవటం వారి నిష్క్రియాపరత్వం, నిర్లక్ష్యానికి నిదర్శనం. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామంటూ చెబుతూనే.. మరోవైపు కార్పొరేట్ కాలేజీలకు ఎర్ర తివాచీలు పరవటం వారికే చెల్లింది. మన రాష్ట్రంలో సాక్షాత్తూ ముఖ్యమంత్రే, విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. మొన్నటి పది, ఇంటర్, ఎప్‌సెట్ ఫలితాల్లో ప్రభుత్వ బడులు, కళాశాలలు, గురుకులాలు%ఁ% ప్రయివేటు, కార్పొరేట్‌కు ధీటుగా తమ సత్తా చాటాయి. ఈ నేపథ్యంలో వాటిని మరింత బలోపేతం చేయటం ద్వారా కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి విద్యారంగాన్ని కాపాడాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకుల మెడపై కత్తి పెట్టి, బోధనేతర పనులను అప్పగిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. అప్పుడే నాణ్యమైన విద్యాబోధన సాధ్యం.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక www.saisuryaa.com

## సంపాదకీయం

### మన భద్రతా వ్యూహంలో.. కొత్త అధ్యాయం

ఉగ్రవాదంపై తన విధానాన్ని మరోసారి చాటి చెప్పి భారత్, ఇటీవల నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఈ ఆపరేషన్ కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాక, కోట్లాది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచింది.'ఉగ్రవాదం, చర్చలు కలిసి ఉండలేవు. రక్తం, నీరు కలిసి పారవు, ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక సైనిక చర్య కాదు. ఇది భారత సైనిక పరాక్రమానికి ఒక కొత్త అధ్యాయం. ఉగ్రవాదంపై పోరాటంలో మైలురాయి చర్య' అని మోదీ స్పష్టంగా తెలిపారు. ఇది తాత్కాలిక చర్య కాదు.. దీని వెనుక ఉన్న విధాన మార్పే ప్రపంచం గమనించాల్సిన అంశం.ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన దారుణ ఉగ్రదాడిలో అమాయక పౌరులు, తమ కుటుంబాల ఎదుటే హత్య చేయబడిన సంఘటన దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడిని కేవలం క్రూర నేరంగా కాకుండా, భారతీయ గౌరవం, సామరస్యం మీద జరిగిన కుట్రగా ప్రధాని మోడీ అభివర్ణించారు.

**ఆపరేషన్ సిందూర్ గట్టి గుణపాఠం**

ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా మే 6 - 7 తేదీలలో భారత సాయుధ దళాలు పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిక్షణా శిబిరాలపై ఖచ్చితమైన క్షిపణి, డ్రోన్ దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో దశాబ్దాలుగా భారత్‌కు ముప్పుగా ఉన్న 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ చర్య ఉగ్రవాద నిర్మూలనలో కీలక మలుపుగా నిలిచింది. భారత దాడులు పాకిస్తాన్‌ను కుదిపేశాయి. పాకిస్తాన్ సైనిక స్థావరాలు, వాయుసేన స్థావరాలు, నౌకాదళ ప్రధాన కేంద్రంపై నేరుగా దాడి చేయడం వారి మౌలిక సదుపాయాలను మాత్రమే కాక, మనో ధైర్యాన్ని కూడా ఛిన్నాభిన్నం చేసింది. బహవల్‌పూర్, మురిద్కే వంటి ప్రదేశాలు, గతంలో 911, లండన్ ట్యూబ్ దాడులు, ముంబయి ఉగ్రదాడులతో అనుసంధానించబడిన కేంద్రాలుగా ఉండగా, ఇప్పుడు భారత్‌కి సునాయాస లక్ష్యాలుగా మారాయి.

**'మేడ్ ఇన్ ఇండియా' డిఫెన్స్ సుపర్బ్!**

ఈ ఆపరేషన్ విజయానికి 'మేడ్ ఇన్ ఇండియా' రక్షణ పరికరాలు కీలకంగా నిలిచాయి. ఇది స్వదేశీ రక్షణ సామర్థ్యాలపై ప్రభుత్వ నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఆధునిక డ్రోన్లు, ఖచ్చితమైన క్షిపణులు... ఇవన్నీ భారత్ త్రివిధ దళాల పోరాట పటిమకి ఆధునిక సాంకేతిక వినియోగానికి పరిపక్వతకు సంకేతాలు.. మన భద్రతా సిద్ధాంతంలో మూడు ప్రధాన మార్పులు చోటు చేసుకున్నాయి. అవి కఠినమైన ప్రతీకారం ఉగ్రవాదంపై భారతదేశం ఇక నిర్దయగా, నిర్దిష్టంగా ప్రతీకారం తీసుకుంటుంది. భారత్ అణు బెదిరింపులను లెక్కచేయదు.. దానికంటే ప్రాధాన్యం దేశ గౌరవం అని ఈ ఆపరేషన్ సిందూర్ నిరూపించింది.

**స్కాల్ఫ్-ఇజి క్రూయిజ్ క్షిపణులు**

భారత రాఫెల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగించిన %ాజాూ్రా-జు+ (ొశీతీఎ ాష్టుఙఅశీష%) క్రూయిజ్ క్షిపణులు ఫ్రాన్స్, యూకే సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ ఖచ్చితత్వ దాడి ఆయుధం కొన్ని అత్యాధునిక లక్షణాలతో రూపొందించ బడింది. ఈ ఆయుధం రాడార్‌లకు చిక్కకుండా లక్ష్యాన్ని చేరు తుంది. భారీ కాంక్రీటు బంకర్లను ధ్వంసం చేయగల సత్తా కలిగి వుంది. శక్తివంతమైన వార్‌హెడ్ ఉండటంతో పాటు లక్ష్యాలను స్వయంగా గుర్తించగలదు. 250 కి.మీ పైగా ప్రయాణించగలదు, అంత దూరం ఉన్న లక్ష్యాలను ఇక్కడి నుండే దాడి చేయగలదు. ఈ క్షిపణులను ఉపయోగించి బహావల్పూర్, మురిద్కే వంటి ఉగ్ర స్థావరాలను అత్యంత ఖచ్చితంగా ధ్వంసం చేశాయి. అదే సమయంలో, భారత్, రష్యా కలిసి అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు కూడా ఉపయోగించబడ్డాయి. ఇవి ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణులలో ఒకటి. వీటిని కీలకమైన పాకిస్తాన్ మౌలిక సదుపాయాలను వేగంగా ధ్వంసం చేయడానికి వినియోగించారు.

**గేమ్ చేంజర్ ఎస్- 400**

ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఎస్-400 విస్తృతమైన రేంజ్‌ను కలిగి ఉంది. 600 కి.మీల దూరంలోని లక్ష్యాలను సైతం ఇది గుర్తించగలదు. 400 కిలోమీటర్ల వరకూ మిసైళ్లను ప్రయో గించి శత్రు దేశాలకు చెందిన యుద్ధ విమానాలు (%ఖీ-16, ఖీ%-35, సుఖోయ్-30), క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిసైళ్లు, డ్రోన్లు, ఇతర హానికర వాయుసేన వస్తువులను నాశనం చేయగలిగింది. దీని రియాక్షన్ టైమ్ కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల 5-10 సెకన్లలో కదులుతున్న టార్గెట్‌ను లాక్ చేసి నేల కూల్చగలిగింది. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఉన్న కీలకమైన సాంకేతిక అంశాలు ఏకకాలంలో 100 కంటే ఎక్కువ లక్ష్యాలను ట్రాక్ చేయగలదు. 4 రకాల మిసైళ్లతో విభిన్న రేంజ్‌లలో రక్షణ. లక్ష్యాన్ని 5-10 సెకన్లలో గుర్తించి తిప్పికొట్టే సామర్థ్యం. వాహనాలపై కదిలే విధంగా రూపొందించబడిన ఈ వ్యవస్థ ఎక్కడికైనా తేలికగా మోహరిం చగలదు. ఫలించిన పారికర్ దృఢ నిర్ణయం 2016లో రక్షణ మంత్రి మనోహర్ పారికర్ తీసుకున్న దృఢమైన నిర్ణయం ఫలితంగా, %ూ%-400 కొనుగోలు చేయవద్దని అమెరికా, భారత్‌పై ఎంతో ఒత్తిడి తీసుకువచ్చింది. మన దేశంలోని నేతలు వ్యతిరేకించినప్పటికీ.. భారత్‌కి చైనా, పాకిస్తాన్ నుంచి పొంచి ఉన్న ముప్పు కారణంగా వీటిని రష్యా నుంచి కొనుగోలు చేశారు. అదే ఇప్పుడు మనల్ని కాపాడింది. అదే కాకుండా ప్రపంచంలోనే అత్యుత్తమ డిఫెన్స్ టెక్నాలజీ ఆయన హయాంలోనే భారత్‌కు లభ్యమైంది. ఇప్పుడు ఆ విజ్ఞానం వాస్తవంగా ఫలాలు ఇస్తోంది. సాంకేతిక సమన్వయం, విజయం వెనుక ఉన్న శాస్త్రీయ శక్తి ఈ ఆపరేషన్ విజయవంతంగా సాగడానికి ప్రధాన కారణం.. భారత సైన్యం అత్యంత ఆధునిక వ్యవస్థలను ఖచ్చితంగా సమన్వయం చేయడమే. రియల్ టైం శాటిలైట్ ఇమేజింగ్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ జామింగ్ టెక్నా లజీలు Network-centric warfare ఆధారిత సమాచార బదిలీ మొత్తంగా, ఆపరేషన్ సిందూర్ ఒక సాంకేతిక విజ్ఞాన ఆధారిత దేశభక్తి.. శాస్త్ర, వ్యూహ, సామర్థ్యాల సమన్వయ రూపకల్పనగా నిలిచింది. ఇది భవిష్యత్తులో భారతదేశం సాధించబోయే వ్యూహాత్మక ఆధిక్యం వైపు తీసుకెళ్లే మరొక అడుగు.

# టర్కీ లేకపోతే ఇండియా.. బ్రిటిష్ వారికి బానిస అయ్యేది కాదు..! పచ్చి నిజాలు..



టర్కీ(తుర్కియే).. ఇండియాలో వ్యతిరేకత మూటగట్టుకున్న దేశం. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల సమయంలో తుర్కియే పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడం, పాకిస్తాన్‌కు ఆయుధాలను సరఫరా చేయడమే దీనికి కారణం. ఆ విషయం పక్కనపెడితే.. అసలు టర్కీ లేకుంటే బ్రిటిష్ వారు భారతదేశాన్ని ఆక్రమించి ఉండేవారు కాదని మీకు తెలుసా? ఈ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలను మార్చడంలో టర్కీ ప్రధాన పాత్ర పోషించింది. టర్కీ ప్రపంచాన్ని మార్చిన ఈ కథ దాదాపు 600 సంవత్సరాల నాటిది. 1453 సంవత్సరంలో నేటి ఇస్తాంబుల్(టర్కీ రాజధాని) ఒట్టోమన్ సామ్రాజ్యం ఆధీనంలోకి వచ్చింది. అంతకు ముందు ఆసియా, యూరప్ ఖండాల మధ్య వ్యాపించిన ఈ నగరాన్ని కాన్స్టాంటినోపుల్ అని పిలిచేవారు. దీనిని రోమన్ సామ్రాజ్యం 1500 సంవత్సరాలు పరిపాలించింది. అధికార మార్పుతో మొత్తం ప్రపంచం ఆర్థిక, రాజకీయ ధోరణి మారిపోయింది.

వాణిజ్యం ఆగిపోయింది..

కాన్స్టాంటినోపుల్ సింహాసనంపై కూర్చున్న కొత్త సామ్రాజ్యం చేసిన మొదటి పని యూరప్, ఆసియా మధ్య వాణిజ్యం జరిగే భూ మార్గాన్ని మూసివేయడం. ఆ సమయంలో ఐరోపాలో భారతీయ సుగంధ ద్రవ్యాలు, ముఖ్యంగా నల్ల మిరియాలు, వస్త్రాలు, ముఖ్యంగా మస్లిన్ (ఢాకా మస్లిన్) కు చాలా డిమాండ్ ఉండేది. వీటిని అక్కడ విలాస వస్తువులుగా అమ్మేవారు. కాన్స్టాంటినోపుల్‌కు వెళ్లే మార్గం మూసివేయడంతో ఈ వస్తువుల వ్యాపారం ఆగిపోయింది. అదే సమయంలో చైనా సిల్క్ రూట్ ద్వారా వాణిజ్యం కూడా ప్రభావితమైంది. ఈ ఒక్క సంఘటన తర్వాత యూరప్‌లో కొత్త వాణిజ్య మార్గాలను కనుగొనే పోటీ మొదలైంది. స్పెయిన్, ఫ్రాన్స్, బ్రిటన్, పోర్చుగల్ వంటి దేశాల నుండి చాలా మంది నావికులు తమ నౌకాదళాలతో భారతదేశానికి చేరుకోవడానికి సముద్ర మార్గాలను అన్వేషించడం ప్రారంభించారు. క్రిస్టోఫర్ కొలంబస్ కూడా భారతదేశానికి మార్గం వెతుక్కుంటూ బయలుదేరి అనుకోకుండా అమెరికా చేరుకున్నాడు. 1492 లో అమెరికా ఈ విధంగా కనుగొనబడింది. అయితే వాస్కో డి గామా పోర్చుగల్ నుండి వచ్చి ఆఫ్రికా తీరం వెంబడి సముద్రం ద్వారా ప్రయాణించి 'కేప్ ఆఫ్ గుడ్ హోప్' దాటి భారతదేశంలోని కాలికట్ చేరుకున్నాడు.వాస్కో డి గామా కనుగొన్న మార్గం చాలా సురక్షితమైనది. దీని తరువాత దాదాపు 100 సంవత్సరాల పాటు పోర్చుగీస్, డచ్ వారు భారతదేశం నుండి యూరప్‌కు బట్టలు, సుగంధ ద్రవ్యాలను వ్యాపారం చేశారు. ఈ వ్యాపారం ద్వారా అతను చాలా డబ్బు సంపాదించారు. భారతదేశంపై కూడా బంగారు వర్షం కురిసింది. నల్ల మిరియాలు, మస్లిన్ వంటి వస్తువులకు ఐరోపాలో డిమాండ్ పెరుగుతూనే ఉంది, అయితే భారతదేశం నుండి ఈ వస్తువులను తీసుకురావడంలో పోర్చుగీసు వారికి గుత్తాధిపత్యం ఉంది. ఆ సమయంలో బంగారం, వెండి నాణేలు కరెన్సీగా చెలామణిలో ఉండేవి. భారతీయులు మిరియాలు, మస్లిన్ వంటి దుస్తులకు బదులుగా యూరప్ నుండి చాలా బంగారాన్ని పొందారు. ఈ విధంగా భారతదేశంలో బంగారు నిల్వలు భారీగా పెరిగాయి.

బ్రిటిష్ వారికి బానిసగా..

దాదాపు 100 సంవత్సరాల తరువాత 1600వ సంవత్సరంలో బ్రిటిష్ వారు భారత్‌కు వచ్చారు. ఆ తరువాత ఫ్రెంచ్, డానిష్ ప్రజలు కూడా ఈ వ్యాపారం నుండి లాభాలు సంపాదించడానికి భారతదేశానికి వచ్చారు. భారతదేశ వాణిజ్యాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఈ దేశాలన్నింటి మధ్య అనేక యుద్ధాలు కూడా జరిగాయి. బ్రిటిష్ వారు తమ తుపాకుల సహాయంతో చాలా చోట్ల గెలిచారు. ఈ చరిత్రలో ప్రధాన ఘట్టం 1757 నాటి 'ప్లాసీ యుద్ధం'. బెంగాల్ గడ్డపై జరిగిన ఈ యుద్ధం బ్రిటిష్ వారికి భారతదేశంలో తమ పట్టును స్థాపించుకునే అవకాశాన్ని కల్పించింది. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు, 1764లో జరిగిన బక్సర్ యుద్ధం భారతదేశ చరిత్రను మార్చివేసింది, క్రమంగా దేశం బ్రిటిష్ వారికి బానిసగా మారింది.

# పాకిస్తాన్ నుంచి చేజారుతున్న బెలూచిస్తాన్.. స్వతంత్ర దేశంగా అవతరించబోతుందా..?



ముందు భారత్.. వెనుక బలూచ్. పాకిస్తాన్‌కు రెండువైపులా వాయింపుడు షురూ అయింది. బలూచ్ ముందు పాక్ తూచ్ అవుతోంది. %దీూా% ఫైటర్స్.. మొన్న పాక్ ఆర్మీ జవాన్ల దుస్తులు విప్పేశారు. ఇప్పుడు మరింత ఉధృతంగా దాడులు చేస్తున్నారు. పాక్ ఆర్మీని తరిమికొడుతున్నారు. బలూచిస్తాన్‌లో విజయకేతనం ఎగురవేస్తున్నారు. పాక్‌కు బలూచ్ ఆర్మీ మరింత తలనొప్పులు తెస్తోంది. పాకిస్తాన్ చేతుల్లో నుంచి బలూచిస్తాన్ జారిపోతోంది. %దీూా% వరుస దాడులతో పాక్ ఆర్మీ బెంబేలెత్తిపోతోంది. గత కొన్ని రోజులుగా బలూచిస్తాన్‌లో నాన్‌స్టాప్ వార్ జరుగుతోంది. పాక్ సైన్యాన్ని బలూచ్ లిబరేషన్ ఆర్మీ తరుముతోంది. బలూచిస్తాన్‌లో పలు చోట్ల పాక్ ఆర్మీపై %దీూా% దాడులు చేస్తోంది. పాక్ పోలీస్ స్టేషన్లను స్వాధీనం చేసుకుని, హైవేలను నిర్బంధించింది. పాకిస్తాన్ పోలీసులను ఖైదు చేసింది. పాక్ ఆర్మీ ఇన్‌ఫార్మర్లను %దీూా% ఫైటర్లు అదుపులోకి తీసుకుంటున్నారు. పాక్ బలగాలపై ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నారు. బాంబులతో పాక్ ఆర్మీ వాహనాలను పేల్చివేస్తున్నారు. కోటిన్నర జనాభా ఉన్న బెలూచిస్తాన్.. పాకిస్తాన్‌లోని అతిపెద్ద ప్రాంతం. బొగ్గు. బంగారం లాంటి ఖరీదైన ఖనిజ నిక్షేపాలతో పాటు సహజవాయు నిల్వలు అపారంగా ఉన్నా.. తమకు ప్రయోజనాలు దక్కడం లేదనేది స్థానికుల వాదన. పైగా.. పాకిస్తాన్ ప్రభుత్వం తమపై రాజకీయంగా కక్ష తీర్చుకుంటోందన్న ఆవేదన. వీళ్ల కడుపుమంట నుంచి పుట్టిందే బలూచ్ లిబరేషన్ ఆర్మీ.. బీఎల్ఏ. పాకిస్తాన్ నుంచి విడదీసి బలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో పాతికేళ్ల కింద ఏర్పాటైన వేర్పాటువాద సంస్థ. పాకిస్తాన్-ఇరాన్ మధ్య విభజించిన ఇరానియన్ జాతి సమూహం. బలూచ్-నివాస ప్రావిన్సులు కేంద్ర ప్రభుత్వాలకు నిరంతరం ఇబ్బందులకు కారణమవుతున్నాయి. సాయుధ స్వాతంత్ర్య ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. పుట్టింది ఆఫ్ఘన్ నగరం కాందహార్‌లో.. నలుగురితో మొదలై ఇప్పుడు 600 మంది సాయుధులతో మిలిటెంట్ ఆర్గనైజేషన్‌గా ఎదిగింది. మొదట్లో ఆఫ్ఘన్ నుంచే ఎటాకింగ్ షురూచేసేది. తర్వాత పాకిస్తాన్ లోపలికి జొరబడి బెలూచ్ నడిగడ్డ మీద నుంచే సవాల్ విసురుతోంది. ఇప్పుడు పాకిస్తాన్ మిలిటరీకి సమఉజ్జీగా మారి.. ఆ దేశ పాలకుల కంట్లో నలుసుగా మారింది. పాకిస్తాన్ ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యల్లో అత్యంత కీలకమైంది బెలూచ్ తిరుగుబాటు బెడద. "పాకిస్తాన్ ఒక వికృతమైన భావజాలమున్న న్యూక్లియర్ కంట్రీ.. ఐసిస్ లాంటి గ్లోబల్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌కు పాలు పోసి పెంచుతోంది.. ఈ మొత్తం ప్రోగ్రామ్ ఐఎస్ఐ కనుసన్నల్లోనే డిజైనౌతోంది.. మేమైతే సైలెంట్‌గా చూస్తూ కూర్చునేవాళ్లం కాదు%ొ% 51 చోట్ల 71 సార్లు దాడులు చేశాం.. ఇప్పుడే సినిమా ఐపోలేదు.." అని పాకిస్తాన్ ఒరిజినల్ షేప్‌ను ప్రపంచానికి చాటి చెబుతోంది బెలూచ్ లిబరేషన్ ఆర్మీ. అది 1540 సంవత్సరం, భారతదేశపు మొట్టమొదటి మొఘల్ పాలకుడు బాబర్ కుమారుడు హుమాయున్, బీహార్‌కు చెందిన షేర్ షా సూరి చేతిలో ఓడిపోయాడు. హుమాయున్ భారతదేశం నుండి పారిపోయాడు. అతను పర్షియాలో అంటే ఇరాన్‌లో ఆశ్రయం పొందాడు. షేర్ షా సూరి 1545లో మరణించాడు. అవకాశాన్ని గ్రహించి, హుమాయున్ భారతదేశానికి తిరిగి రావాలని ప్రణాళిక వేయడం ప్రారంభించాడు. అప్పుడు బలూచిస్తాన్ గిరిజన నాయకులు ఈ ప్రణాళికలో అతనికి సహాయం చేశారు. బలూచ్‌ల మద్దతుతో, హుమాయున్ 1555లో ఢిల్లీపై తిరిగి నియంత్రణ సాధించాడు. 1659 సంవత్సరం. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ఢిల్లీ పాలకుడు అయ్యాడు. అతని అధికారం పశ్చిమాన ఇరానియన్ సరిహద్దు వరకు విస్తరించింది. కానీ దక్షిణాన అతను నిరంతరం మరాఠాల నుండి సవాళ్లను ఎదుర్కోవలసి వచ్చింది. మరోవైపు బలూచి అధిపతులు మొఘల్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. బలూచి నాయకుడు మీర్ అహ్మద్ 1666లో ఔరంగజేబు నుండి బలూచిస్తాన్‌లోని రెండు ప్రాంతాలు %-% కలాట్, క్వెట్టాను స్వాధీనం చేసుకున్నాడు. నేడు బలూచిస్తాన్ ఉన్న ప్రదేశం చరిత్ర దాదాపు 9 వేల సంవత్సరాల నాటిది. ఆ సమయంలో ఇక్కడ మెహర్‌గఢ్ ఉండేది. ఇది సింధు లోయ నాగరికతలో ఒక ప్రధాన నగరం. దాదాపు 3 వేల సంవత్సరాల క్రితం సింధు లోయ నాగరికత ముగిసినప్పుడు, ఇక్కడి ప్రజలు సింధ్, పంజాబ్ ప్రాంతాలలో స్థిరపడ్డారు. దీని తరువాత ఈ నగరం వేద నాగరికత ప్రభావానికి లోనైంది. ఇక్కడ హిందువుల ప్రధాన శక్తి పీఠాలలో ఒకటి %-% హింగ్లాజ్ మాతా ఆలయం, దీనిని పాకిస్తాన్‌లో నాని కా హజ్ అని కూడా పిలుస్తారు. కాలక్రమేణా ఈ నగరం బౌద్ధమతానికి ప్రధాన కేంద్రంగా కూడా మారింది. ఏడవ శతాబ్దంలో అరబ్ ఆక్రమణదారులు ఈ ప్రాంతంపై దాడి చేసినప్పుడు, ఇక్కడ ఇస్లాం ప్రభావం పెరిగింది. బలూచిస్తాన్ పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం, దాని భూభాగంలో 44 శాతం ఆక్రమించింది. జర్మనీ పరిమాణంలో ఉన్నప్పటికీ, దాని జనాభా కేవలం 15 మిలియన్లు, ఇది జర్మనీ కంటే 70 మిలియన్లు తక్కువ. బలూచిస్తాన్ చమురు, బంగారం, రాగి మరియు ఇతర గనులతో సమృద్ధిగా ఉంది. ఈ వనరులను ఉపయోగించడం ద్వారా పాకిస్తాన్ తన అవసరాలను తీర్చుకుంటుంది. అయినప్పటికీ, ఈ ప్రాంతం అత్యంత వెనుకబడింది. బలూచిస్తాన్‌లో పాకిస్తాన్‌పై ద్వేషం పెరగడానికి ఇదే కారణం. పాకిస్తాన్ ఆక్రమణ తర్వాత బలూచిస్తాన్‌లో ఐదు ప్రధాన తిరుగుబాట్లు జరిగాయి. ఇటీవలి తిరుగుబాటు 2005లో ప్రారంభమై నేటికీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే భారత్ సహా మిగతా దేశాల మద్దతును కూడదీసుకుని.. పాకిస్తాన్ పాలకుల్ని కార్నర్ చేయాలన్నది బీఎల్ఏ స్కెచ్చులా కనిపిస్తోంది. ఈ పాచిక కనుక పారితే.. ఆసియా ఖండంలో కొత్త దేశంగా బెలూచిస్తాన్ జెండా ఎగరడం ఖాయం. ఇది మాత్రం పక్కా..!

# నష్టాన్ని పూడ్చాల్సిందే, లేదంటే సీఎస్ జైలుకే - కంచ గచ్చిబౌలిపై సుప్రీం..!!



సంచలనంగా మారిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్? జైలుకు వెళ్లాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చ రించింది. సీఎస్? తో పాటు కార్యదర్శులూ జైలుకు పోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. లాంగ్? వీక్? ఎండ్? చూసి ఎందుకు చర్యలు చేపట్టారని అధికారులను అడిగింది. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చాల్సిందేనని స్పష్టం చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం కీలక వ్యాఖలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించిన ధర్మాసనం హెచ్చరించింది. కాగా సీఈసీ దాఖలు చేసిన అఫిడవిట్‌పై కౌంటర్ వేసేందుకు కొంత సమయం కావాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. దీంతో జులై 23వ తేదీలోపు గతంలో ఉన్నట్లుగా అక్కడ పర్యావరణాన్ని పునరుద్ధరించాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంటూ తదుపరి విచారణ జులై 23 వ తేదీకి వాయిదా వేసింది. అలాగే విద్యార్థులపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలంటూ దాఖలైన ఐఏను సుప్రీంకోర్టు త్రోసి పుచ్చింది. ఆ విషయంలో ప్రత్యేకంగా మరో పిటీషన్‌ను దాఖలు చేయాలని, ఈ కేసులో కలపకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. గత విచారణ సందర్భంగా పర్యావరణ వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెబుతూ.. నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు యధాస్థితి కొనసాగించాలని పేర్కొంది. ఈలోగా ఒక్క చెట్టు కూడా నరకడానికి ఒప్పుకోమని స్పష్టం చేసింది. విచారణ ప్రారంభంలోనే వివరాలను పరిశీలించిన సీజేఐ తెలంగాణ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇష్టానుసారంగా డజన్ల కొద్దీ బుల్డోజర్లతో చెట్లు తొలగించేందుకు వినియోగించారని, ఇదంతా ముందస్తు పథకం ప్రకారమే చేసినట్టుగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా.. లేదా అన్నది స్పష్టం చేయాలన్నారు. జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలని జస్టిస్ గవాయ్ అన్నారు.




# ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు ప్రకటన.. విధ్వంసకర ఓపెనర్ రీ ఎంట్రీ



భారత మహిళల క్రికెట్ జట్టు ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో భాగంగా ఆతిథ్య ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లో భారత్ తలపడనుంది. ఈ క్రమంలో ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్‌లకు భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ గురువారం ప్రకటించింది. ఈ రెండు సిరీస్‌లలో భారత కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరించనున్నారు. అదేవిధంగా ఇంగ్లండ్ టూర్‌కు స్టార్ ప్లేయర్లు శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్ గాయాల కారణంగా దూరమయ్యారు. శ్రేయాంక చేతి వేలి గాయంతో బాధపడుతుండగా.. రేణుకా మోకాలి గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉంటుంది. దీంతో వీరిద్దరూ శ్రీలంక వేదికగా జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లోనూ భారత్ జట్టులో భాగం కాలేదు. మరోవైపు వన్డే జట్టు నుంచి కష్వీ గౌతమ్‌ను సెలక్టర్లు తప్పించారు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో గౌతమ్ ఆడే అవకాశం వచ్చినప్పటికి, పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ఈ క్రమంలోనే ఆమెను సెలక్టర్లు పక్కన పెట్టారు.

షెఫాలీ రీ ఎంట్రీ..

ఇక భారత టీ20 జట్టులోకి స్టార్ ఓపెనర్ షెఫాలీ వర్మ రీ ఎంట్రీ ఇచ్చింది. డబ్ల్యూపీఎల్-2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున షెఫాలీ అద్భుతంగా రాణించడంతో సెలక్టర్లు తిరిగి పిలుపు నిచ్చారు. ఈ ఏడాది డబ్ల్యూపీఎల్ సీజన్‌లో షెఫాలీ 152.76 స్ట్రైక్ రేటుతో 304 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా సైతం టీ20 జట్టులోకి పునరాగమనం చేసింది. అదేవిధంగా వైఎస్ఆర్ జిల్లాకు చెందిన శ్రీచరణి వన్డే, టీ20 జట్టులో చోటు దక్కించుకుంది. ఇటీవలే శ్రీలంక పర్యటనతో అరంగేట్రం చేసిన శ్రీచరణి.. తన అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఇక భారత జట్టు ఇంగ్లండ్ పర్యటన జూన్ 28 నుంచి ప్రారంభం కానుంది.

భారత టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా , హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ రాణా, శ్రీ చరణి, శుచి రణ్‌ఉపాధ్యాయ, కె అరుణ్‌జో ఉపాధ్యాయ్, కె అరుణ్‌జో ఉపాధ్యాయ్ ఉపాధ్యాయ్ సత్ఘరే

భారత వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా , తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, స్నేహ రాణా, శ్రీ చరణి, కె అరుంధా రెడ్డి, షుచి అమన్‌ప్రీత్‌కౌర్ గౌడ్, సయాలీ సత్ఘరే

# ఆ దేశ ఆటగాళ్లు లీగ్ పూర్తయ్యే వరకు అందుబాటులో ఉంటారు..!



ఐపీఎల్ 2025 విషయంలో క్రికెట్ సౌతాఫ్రికా (%జూూ%) యూ టర్న్ తీసుకున్నట్లు తెలుస్తుంది. తొలుత తమ ఆటగాళ్లు ప్లే ఆఫ్స్‌కు అందుబాటులో ఉండరని (డబ్ల్యూటీసీ ఫైనల్ సన్నాహకాల కోసం) ప్రకటించిన ఆ క్రికెట్ బోర్డు, తాజాగా మనసు మార్చుకున్నట్లు సమాచారం. లీగ్ పూర్తయ్యే వరకు (జూన్ 3) వారి ఆటగాళ్లు సంబంధిత ఫ్రాంచైజీలతో ఉండేందుకు క్రికెట్ సౌతాఫ్రికా అంగీకరించినట్లు ఐపీఎల్ వర్గాలు అంటున్నాయి. ఈ ప్రచారం నిజమైతే ఫ్రాంచైజీలకు సగం టెన్షన్ వదిలినట్లే. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో 20 మంది సౌతాఫ్రికా ఆటగాళ్లు వివిధ జట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వీరిలో 8 మంది డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ ఎనిమిది మందిలో ఆరుగురు (కార్బిన్ బాష్, జన్సెన్, ఎంగిడి, రబాడ, రికెల్టన్, స్టబ్స్) ప్రాతినిథ్యం వహిస్తున్న ఫ్రాంచైజీలు ప్లే ఆఫ్స్‌లో ముందున్నాయి. ఈ ఆరుగురు ప్లే ఆఫ్స్‌కు అందుబాటులో ఉండకపోతే సంబంధిత ఫ్రాంచైజీలు భారీగా నష్టపోతాయి.

చక్రం? తిప్పిన ఫ్రాంచైజీ యజమానులు

క్రికెట్ సౌతాఫ్రికా ఆధ్వర్యంలో నడిచే సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో మొత్తం ఆరు ఫ్రాంచైజీలు ఉన్నాయి. ఈ ఆరు ఫ్రాంచైజీలను ఐపీఎల్ ఫ్రాంచైజీల యాజమాన్యాలే నడిపిస్తున్నాయి. తాజా పరిస్థితి నేపథ్యంలో ప్లే ఆఫ్స్ రేసులో ముందున్న ఫ్రాంచైజీల యాజమాన్యాలు చక్రం తిప్పాయి. వారు క్రికెట్ సౌతాఫ్రికాతో మాటతామంతి జరిపి ఆ దేశ ఆటగాళ్లను ప్లే ఆఫ్స్ పూర్తయ్యే వరకు కొనసాగేందుకు ఒప్పించినట్లు తెలుస్తుంది. కాగా, రీ షెడ్యూల్ ప్రకారం ఐపీఎల్ ఫైనల్ ముగిసిన వారం రోజుల్లోనే సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య ప్రతిష్టాత్మక డబ్ల్యూటీసీ ఫైనల్ జరగాల్సి ఉంది.

ఈ నేపథ్యంలోనే క్రికెట్ సౌతాఫ్రికా తమ ఆటగాళ్లను ముందుగా అనుకున్నట్లు మే 26వ తేదీలోగా స్వదేశానికి తిరిగి రావాలని కోరింది. అయితే ఐపీఎల్ ఫ్రాంచైజీల యాజమాన్యాలు చక్రం తిప్పడంతో క్రికెట్ సౌతాఫ్రికా తమ సన్నాహకలను (డబ్ల్యూటీసీ ఫైనల్) వాయిదా వేసుకుంది. జూన్ 3 తర్వాతే వాటి షెడ్యూల్‌ను ప్లాన్ చేసుకుంది.

**ప్లే ఆఫ్స్ రేసులో ముందున్న ఫ్రాంచైజీలకు చెందిన**

**సౌతాఫ్రికా ఆటగాళ్లు**

**(డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఎంపికైన వారు)..**

కార్బిన్ బాష్ (ముంబై ఇండియన్స్)
మార్కో జన్సెన్ (పంజాబ్ కింగ్స్)
లుంగి ఎంగిడి (ఆర్సీబీ)
కగిసో రబాడ (గుజరాత్)
ర్యాన్ రికెల్టన్ (ముంబై)
ట్రిస్టన్ స్టబ్స్ (ఢిల్లీ)

డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం సౌతాఫ్రికా జట్టు: టెంబా బావుమా (కెప్టెన్), ఎయిడెన్ మార్క్రమ్, లుంగి ఎం?గిడి, టోనీ డి జోర్జి, డేవిడ్ బెడింగ్హమ్, కేశవ్ మహరాజ్, ట్రిస్టన్ స్టబ్స్, కార్బిన్ బాష్, సెనురన్ ముత్తుసామి, మార్కో జన్సెన్, కగిసో రబడ, కైల్ వెర్రెయిన్, డేన్ ప్యాటర్సన్, వియాన్ ముల్డర్, ర్యాన్ రికెల్టన్.

# ఆర్సీబీకి శుభవార్త.. హాజిల్‌వుడ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు..?



మే 17 నుంచి ఐపీఎల్ 2025 పునఃప్రారంభం కానున్న వేల ఆర్సీబీకి శుభవార్త అందింది. భారత్-పాక్ మధ్య యుద్ధం కారణంగా? స్వదేశాలకు వెళ్లిపోయిన ఆ ఫ్రాంచైజీ ప్లేయర్లంతా తిరిగి వచ్చేందుకు అంగీకరించారని తెలుస్తుంది. జాతీయ విధుల కారణంగా జేకబ్ బేతెల్ ఒక్కడే తదుపరి లెగ్‌కు అందుబాటులో ఉండడని సమాచారం. స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ తిరిగొచ్చేందుకు అంగీకరించడం ఆర్సీబీకి అతి పెద్ద శుభవార్త. వాస్తవానికి హాజిల్‌వుడ్ ఐపీఎల్ వాయిదా పడకముందే గాయపడ్డాడు. రీ షెడ్యూల్ తర్వాత అతను అందుబాటులో రావడం దాదాపుగా అసాధ్యమేనని అంతా అనుకున్నారు. ఐపీఎల్ ముగిసిన వారం రోజుల్లోనే (జూన్ 11) డబ్ల్యూటీసీ ఫైనల్ ఉండటంతో హాజిల్‌వుడ్ జాతీయ విధులకే ప్రాధ్యాన్యత ఇస్తాడని ప్రచారం జరిగింది. అయితే ఆర్సీబీ యాజమాన్యం చర్చల కారణంగా హాజిల్‌వుడ్ సీజన్ అయిపోయే వరకు ఆడేందుకు అంగీకరించినట్లు తెలుస్తుంది. మరోవైపు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు కూడా తమ ఆటగాళ్లకు లీగ్ అయిపోయే వరకు కొనసాగేందుకు అనుమతి ఇవ్వడంతో లుంగి ఎంగిడి సేవలు కూడా ఆర్సీబీ లీగ్ అయిపోయే వరకు వినియోగించుకోనుంది. మిగతా విదేశీ ఆటగాళ్ల విషయానికొస్తే.. ఫిల్ సాల్ట్ విండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక కాలేదు. దీంతో అతను ప్లే ఆఫ్స్‌లో ఆడేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు. టిమ్ డేవిడ్, లివింగ్‌స్టోన్ వారి జట్లలో సభ్యులుగా లేరు. వీరి నుంచి కూడా ఎలాంటి సమస్య లేదు. ఐర్లాండ్‌తో సిరీస్‌కు ఎంపికైనా రొమారియో షెపర్డ్ తమ బోర్డును ఒప్పించుకుని లీగ్ మొత్తానికి అందుబాటులోకి వచ్చాడు. మొత్తంగా చూస్తే.. విదేశీ ఆటగాళ్లంతా లీగ్ అయిపోయే వరకు అందుబాటులో ఉండటం ఆర్సీబీకి శుభపరిణామంగా చెప్పవచ్చు. ఈ సీజన్‌లో ఆర్సీబీ గతంలో ఎన్నడూ లేనట్లుగా హాట్ ఫేవరెట్‌గా కనిపిస్తుంది. విదేశీ ఆటగాళ్లతో పాటు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి కూడా పూర్తిగా అందుబాటులో ఉండటం (టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించడం?), అందులోనూ భీకర ఫామ్‌లో ఉండటం ఆర్సీబీ తొలి టైటిల్ కలను నెరవేర్చేలా కనిపిస్తుంది. ప్రస్తుత సీజన్‌లో ఆర్సీబీ దేశీయ ఆటగాళ్లు కూడా అత్యంత ప్రమాదకరంగా ఉన్నారు. బౌలర్లలో యశ్ దయాల్, కృనాల్ పాండ్యా, సుయాశ్ శర్మ అంచనాలకు మించి రాణిస్తున్నారు. ఆర్సీబీ ప్రస్తుమున్న ప్రధాన సమస్య వారి కెప్టెన్ రజత్ పాటిదార్ ఒక్కడే. పాటిదార్ గాయంతో బాధపడుతుండటంతో పాటు పెద్దగా ఫామ్‌లో లేడు. అతనితో పాటు వికెట్ కీపర్ జితేశ్ శర్మకు కూడా అంచనాలకు తగ్గట్టుగా రాణించడం లేదు. వీరిద్దరు కూడా లైన్‌లోకి వచ్చారంటే ఈ సీజన్‌లో ఆర్సీబీ టైటిల్ గెలవకుండా ఆపడం ఎవరి వల్ల కాదు. దేవ్‌దత్ పడిక్కల్ స్థానంలో వచ్చిన మయాంక్ అగర్వాల్ కూడా టాపార్డర్‌లో మ్యాజిక్ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో (11 మ్యాచ్‌ల్లో 8 విజయాలతో 16 పాయింట్లు) ఉన్న ఆర్సీబీ.. ఈ సీజన్‌లో మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. మే 17న కేకేఆర్‌తో (బెంగళూరు), మే 23న సన్‌రైజర్స్‌తో (బెంగళూరు), మే 27న లక్నోతో (లక్నో) తలపడనుంది. ఈ మూడు మ్యాచ్‌ల్లో ఒక్కటి గెలిచినా ఆర్సీబీ ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది.

# ముంబై ఇండియన్స్‌లోకి శ్రీలంక కెప్టెన్..!



ఐపీఎల్-2025 రీ షెడ్యూల్ కారణంగా దారుణంగా నష్టపోతున్న ఫ్రాంచైజీలలో ముంబై ఇండియన్స్ ఒకటి. భారత్-పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తల కారణంగా అర్ధరంతరంగా ఆగిపోయిన ఈ ఏడాది ఐపీఎల్ సీజన్.. తిరిగి మే 17 నుంచి ప్రారంభం కానుంది. అయితే చాలా మంది విదేశీ ఆటగాళ్లు జాతీయ విధుల కారణంగా ఐపీఎల్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరం కానున్నారు. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ జట్టు స్టార్ ప్లేయర్లు ర్యాన్ రికెల్టన్, కార్బిన్ బాష్, విల్ జాక్స్ సేవలను కోల్పోయే అవకాశముంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఎంపిక చేసిన దక్షిణాఫ్రికా జట్టులో బాష్, రికెల్టన్ భాగంగా ఉన్నారు. బాష్, రికెల్టన్ ఒకవేళ ఐపీఎల్‌లో పాల్గొనేందుకు తిరిగి భారత్‌కు వచ్చినా, ప్లే ఆఫ్స్‌కు మాత్రం కచ్చితంగా దూరంగా ఉండనున్నారు. దక్షిణాఫ్రికా క్రికెట్‌తో బీసీసీఐ సంప్రదింపులు జరిపినప్పటికి.. సదరు క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లు లీగ్ పూర్తి అయ్యేంతవరకు ఉండేందుకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు వెస్టిండీస్‌తో త్వరలో జరగబోయే టీ20, వన్డే సిరీస్‌లకు ఎంపిక చేసిన ఇంగ్లండ్ జట్టులో జాక్స్ సభ్యునిగా ఉన్నాడు. అతడు కూడా భారత్‌కు తిరిగి వచ్చినా ప్లే ఆఫ్స్‌కు మాత్రం దూరంగా ఉండనున్నాడు.

ముంబై జట్టులోకి శ్రీలంక కెప్టెన్..?

ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ యాజమాన్యం శ్రీలంక కెప్టెన్ చరిత్ అసలంకపై కన్నేసినట్లు తెలుస్తోంది. తమ జట్టులోకి తీసుకునేందుకు చరిత్ అసలంకాతో ముంబై చర్చలు జరుపుతున్నట్లు శ్రీలంక వార్తా సంస్థ న్యూస్ వైర్ తమ కథనంలో పేర్కొంది. అసలంకకు టీ20ల్లో అద్భుతమైన రికార్డు ఉంది. అతడికి బ్యాట్‌తో పాటు బంతితో కూడా రాణించే సత్తా ఉంది. అంతర్జాతీయ టీ20ల్లో చరిత్‌కు 5 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అతడితో ఒప్పందం కుదర్చుకునేందుకు ముంబై ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కాగా ఐపీఎల్ రీ షెడ్యూల్ కారణంగా ఈ సీజన్‌లో ఆటగాళ్ల తాత్కాలిక ప్రత్యామ్నాయాలకు బీసీసీఐ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ముంబై ఇండియన్స్‌కు ఈ ఏడాది సీజన్‌లో ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ రెండు మ్యాచ్‌ల్లో హార్దిక్ సేన గెలిస్తే నేరుగా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తోంది.

# పంజాబ్ జట్టులోకి డేంజరస్ ప్లేయర్ ఎంట్రీ.. ఇక దబిడి దిబిడే?



**ఐపీఎల్-2025 పునఃప్రారంభానికి ముందు పంజాబ్ కింగ్స్‌కు గుడ్ న్యూస్ అందింది. ఆస్ట్రేలియా విధ్వంసకర ఆల్‌రౌండర్ మిచెల్ ఓవెన్ పంజాబ్ జట్టులో బుధవారం చేరాడు. గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన ఆరో ఆసీస్ ఆటగాడు మ్యాక్స్‌వెల్ స్థానంలో మిచెల్ ఓవెన్‌ను పంజాబ్ మెనెజ్‌మెంట్ ఎంపిక చేసింది. కానీ ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ మధ్యలో ఆగిపోవడంతో ఓవెన్.. పంజాబ్ జట్టుతో చేరడం కాస్త ఆలస్యమైంది. గురువారం(మే 15) నెట్ ప్రాక్టీస్ సెషన్స్‌లో పంజాబ్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్.. ఓవెన్‌ను సహచర ఆటగాళ్లకు పరిచయం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియోను పంజాబ్ కింగ్స్ ఎక్స్‌లో షేర్ చేసింది. కాగా ఈ ఆసీస్ క్రికెటర్ ముందుగా పాకిస్తాన్ సూపర్ లీగ్-2025లో పెషావల్ జల్మి జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. అతడు ఈనెల 9న ఆ జట్టు చివరి గ్రూప్ మ్యాచ్ ఆడాక ఓవెన్ ఐపీఎల్‌లో భాగం కావాల్సి ఉండేది. కానీ పీఎస్ఎల్ కూడా అర్ధాంతరంగా వాయిదా పడడంతో చివరి మ్యాచ్ ఆడకుండానే ఓవెన్ భారత్‌కు చేరుకున్నాడు.**

**ఎవరీ మిచెల్ ఓవెన్..?**

**23 ఏళ్ల మిచెల్ ఓవెన్ లిస్ట్-ఎ, ఫస్ట్‌క్లాస్? క్రికెట్ రెండింటిలోనూ టాస్మానియాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఫిబ్రవరి 22, 2021న మార్ష్ వన్-డే కప్‌తో లిస్ట్-ఎ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఓవెన్.. షెఫీల్డ్ షీల్డ్‌లో సౌత్ ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో అక్టోబర్ 3, 2023న ఫస్ట్-క్లాస్ అరంగేట్రం చేశాడు. టీ20ల్లో కూడా అతడికి మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు 35 టీ20లు ఆడిన ఓవెన్ 647 పరుగులు చేశాడు. అందులో 452 పరుగులు ఈ ఏడాది బిగ్‌బాష్ సీజన్‌లో చేసినవే కావడం గమనార్హం. బీబీఎల్ 2024-25 సీజన్‌లో ఓవెన్ 452 పరుగులు చేసి లీడింగ్ రన్?స్కోరర్‌గా నిలిచాడు.**

**సిడ్నీ థండర్‌తో జరిగిన ఫైనల్లో మ్యాచ్‌లో ఓవెన్ విధ్వసకర సెంచరీతో చెలరేగాడు. కేవలం 39 బంతుల్లోనే ఓవెన్ తన రెండో బీబీఎల్ సెంచరీ మార్క్‌ను ఓవెన్ అందుకున్నాడు. ఓవెన్‌కు పేస్ బౌలింగ్ చేసే సత్తాకూడా ఉంది.**

**అతడు త్వరలోనే ఆస్ట్రేలియా తరపున అరంగేట్రం చేసే ఛాన్స్ ఉంది. ఇక ఈ ఏడాది ఐపీఎల్-2025 సీజన్ మే 17 నుంచి తిరిగి ప్రారంభం కానుంది.**

# ఆసక్తి రేపుతున్న ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ ఆటగాడి పోస్ట్



ఐపీఎల్ ఫ్రాంచైజీలు తాత్కాలిక రీప్లేస్‌మెంట్ల కోసం వెతుకుతున్న వేల, టీమిండియా ఆటగాడు, ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ ఓపెనర్ పృథ్వీ షా పెట్టిన ఓ పోస్ట్ ఆసక్తి రేపుతోంది. ఈ సీజన్ మెగా వేలంలో అమ్ముడుపోని షా.. "బ్రేక్ కావాలంటూ" ఓ పోస్ట్ పెట్టాడు. ఈ పోస్ట్ చూసిన అభిమానులు షా రీప్లేస్‌మెంట్ ఆటగాడిగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాడని కామెంట్లు చేస్తున్నారు. 2018లో అరంగేట్రం చేసిన 25 ఏళ్ల షా.. ఐపీఎల్‌లో డీసెంట్ రికార్డు (79 మ్యాచ్‌ల్లో 147.467 స్ట్రయిక్‌రేట్‌తో 1892 పరుగులు) కలిగి ఉన్నాడు. అయితే వ్యక్తిగత అలవాట్లు, ఫిట్‌నెస్ కోల్పోవడం అతన్ని ఐపీఎల్ పాటు దేశవాలీ క్రికెట్‌కు దూరం చేశాయి. గత సీజన్‌లో ఢిల్లీకి ఆడిన షా.. 8 మ్యాచ్‌ల్లో 163.63 స్ట్రయిక్‌రేట్‌తో 198 పరుగులు చేశాడు. ప్రస్తుత సీజన్‌లో ఢిల్లీ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ సేవలు కోల్పోవడంతో షా ఆ జట్టులో చోటు ఆశిస్తున్నాడు. ప్రస్తుత తరుణంలో షాకు ఢిల్లీ అవకాశం ఇవ్వకపోయినా ముంబై ఇండియన్స్ ఛాన్స్ ఇవ్వొచ్చన్న టాక్ నడుస్తుంది. ముంబై ఇండియన్స్ యాజమాన్యం ఇంగ్లండ్ ఆటగాడు విల్ జాక్స్ స్థానాన్ని భర్తీ చేసేందుకు దేశీయ బ్యాటర్ కోసం? చూస్తుందని సమచారం. ఒకప్పుడు టీమిండియా భవిష్యత్తుగా కీర్తించబడ్డ పృథ్వీ షా ఇప్పుడు ఐపీఎల్‌లో ఛాన్స్ కోసం వెంపర్లాడటం ఆసక్తికరంగా మారింది. క్రమశిక్షణ లేకపోతే ఎంత టాలెంట్ ఉన్నా ఇలాంటి గతే పడుతుందని జనాలు అంటున్నారు. పృథ్వీ షాలా కావొద్దని ఇప్పుడిప్పుడే షైన్ అవుతున్న యువ ఆటగాళ్లకు సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే, భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధం కారణంగా వారం రోజులు వాయిదా పడిన ఐపీఎల్ 2025 మే 17 నుంచి పునఃప్రారంభం కానుంది. యుద్ధం నేపథ్యంలో స్వదేశాలకు వెళ్లిపోయిన విదేశీ క్రికెటర్లు జాతీయ జట్ల అవసరాల దృష్ట్యా ఐపీఎల్ తదుపరి లెగ్‌లో పాల్గొనలేకపోతున్నారు. కొందరు ఇతరత్రా కారణాల చేత ఐపీఎల్‌లో కొనసాగేందుకు విముఖత చూపారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ గవర్నింగ్ బాడీ తిరిగి రాని ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసుకునేందుకు ఫ్రాంచైజీలకు వెసులుబాటు కల్పించింది. ?ఈ క్రమంలోనే పృథ్వీ షా లాంటి చాలా మంది భారత ఆటగాళ్లు ఛాన్స్‌ల కోసం ఎదురుచూస్తున్నారు.

Cinema

# రామ్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'.. గ్లింప్స్ తో హైప్ ఎక్కేలా ఉందే!



టాలీవుడ్ యంగ్ హీరో, ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని.. ఇప్పుడు తన అప్ కమింగ్ మూవీతో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీతో విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకున్న దర్శకుడు పి. మహేష్ బాబుతో ఆయన ప్రస్తుతం వర్క్ చేస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ గ్రాండ్ గా నిర్మిస్తుండగా.. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. నేడు రామ్ పుట్టినరోజు సందర్భంగా.. శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ టైటిల్ ను అనౌన్స్ చేస్తూ.. గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. అంతా అనుకున్నట్లే ఆంధ్ర కింగ్ తాలుకానే ఫిక్స్ చేశారు. థియేటర్ వద్ద అభిమానుల సంబరాలు.. బాణసంచా కాల్పులు.. క్యూలైన్లలో టికెట్స్ కోసం ప్రజలు.. వంటి కోలాహల సీన్స్ తో గ్లింప్స్ ప్రారంభమైంది. అక్కడ యజమాని ఆంధ్రా కింగ్ సూర్య కుమార్ విడుదలకు టిక్కెట్ల కోసం ఫోన్లతో బిజీగా ఉంటారు. ఎమ్మెల్యే తాలూకా, కానిస్టేబుల్ తాలుకా అంటూ టికెట్స్ కావాలని అడుగుతుంటారు. అప్పుడే రామ్ సైకిల్ పై స్టైలిష్ ఎంట్రీ ఇస్తారు. ఆంధ్రా కింగ్ ఫ్యాన్స్ అంటూ 50 టిక్కెట్లు అడుగుతారు. వెంటనే యజమాని ఓకే చెప్పి ఇస్తారు. రామ్ తోటి అభిమానులతో థియేటర్ బయట ఆంధ్రా కింగ్ మూవీ (కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర) కటౌట్ ఎదుట సంబరాల్లో పాల్గొంటారు. అప్పుడు ఆంధ్ర కింగ్ అంటూ గట్టిగా నినాదిస్తారు. అప్పుడే టైటిల్ రివీల్ అవ్వగా.. ఆ విజువల్స్ తో గ్లింప్స్ ఎండ్ అయింది. ఇప్పుడు అందరినీ మెప్పిస్తోంది. అయితే స్టార్ హీరో అయిన రామ్.. ఇప్పుడు మరో స్టార్ హీరో ఫ్యాన్ గా యాక్ట్ చేయడం విశేషమే. సినిమాలో తన యాక్టింగ్ తో మెప్పించనున్నారని క్లియర్ గా తెలుస్తోంది. సినిమా కోసం పూర్తిగా మేకోవర్ చేసుకున్నట్లు కనిపిస్తోంది. సైకిల్ ను పార్క్ చేసే స్టైలిష్ విధానం వేరే లెవెల్. మహేష్ బాబు పి మరోసారి తన మార్క్ చూపించనున్నట్లు తెలుస్తోంది. రైటింగ్ తో ఆకట్టుకుంటారని అర్థమవుతోంది. సిద్ధార్థ విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. వివేక్- మెర్విన్ బ్యాక్ గ్రౌండ్ జోష్ నింపుతోంది. మైత్రీ రిచ్ ప్రొడక్షన్ వాల్యూస్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఓవరాల్ గా గ్లింప్స్.. సినిమాపై మంచి అంచనాలు పెంచ ుతుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు.




# ఒక్క హిట్ తోనే ఊపేసిన నయా మేకర్స్!



ఒక్క హిట్ ఉంటే చాలు. స్టార్ హీరోలు మరో ఆలోచన లేకుండా ఛాన్స్ ఇస్తున్నారు. సినిమా పట్టా లెక్కడం ఆలస్యమవ్వొచ్చు గానీ..తెలివిగా ముందుగా ఆ డైరెక్టర్లను లాక్ చేసి పెడుతున్నారు. అలాంటి డైరెక్టర్లు ప్రస్తుతం నలుగురైదుగురు లైన్ లో ఉన్నారు. %-%హాయ్ నాన్న%-%తో నానికి క్లాస్ హిట్ అందించాడు శౌర్యువ్. కమర్శియల్ గా అనుకున్న రేంజ్ లో సక్సస్ అవ్వనప్పటికీ ఓ సెక్షన్ ఆడియన్స్ కి బాగా నచ్చిన చిత్రంగా తేలింది. శ్యూర్యువ్ ట్యాలెంట్ కి మంచి ప్రశంసలు దక్కాయి. దీంతో విజయ్ దేవరకొండ తనతో సినిమా చేస్తానని అప్పట్లో ప్రామిస్ చేసాడు. తాజాగా తన తదుపరి చిత్రాల లైనప్ లో శౌర్యువ్ కూడా చేరాడు. %-%కింగడమ్%-% రిలీజ్ అనంతరం రాహుల్ సంకృత్యన్ తో పాటు మరో దర్శకుడితో సినిమా ఉంది. వీళ్లిద్దరి సరసన తాజాగా శౌర్యువ్ కూడా చేరాడు. అలాగే %-%కోర్టు%-% విజయంతో యంగ్ మేకర్ రామ్ జగదీష్ పేరు ఇండస్ట్రీలో మారు మ్రోగుతుంది.


తక్కువ బడ్జెట్ లో నే భారీ లాభాలు తెచ్చిపెట్టాడు. దీంతో రామ్ లక్షణ్ తో నేరుగా నానినే సినిమా చేయా లని ప్లాన్ చేస్తున్నాడు. నానికంటే ముందే దుల్కర్ సల్మాన్ పిలిచి అవకాశం ఇచ్చాడు. ముందుగా దుల్క ర్ తోనే ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. మరికొంత మంది నిర్మాతలు తమ బ్యానర్లో చేయా ల్సిందిగా అడ్వాన్స్ లు చెల్లించారు. %-%దసరా%-% హిట్ తో లైన్ లోకి వచ్చిన శ్రీకాంత్ ఓదెలకు ఏకంగా మెగాస్టార్ చిరంజీ వినే డైరెక్ట్ చేసే అవకాశం వచ్చింది. %- దసరా%-% హిట్ చూసి చిరంజీవి పిలిచి అవకాశం ఇచ్చారు. అదే హిట్తో నాని అదే దర్శకుడితో %-%ది ప్యార డైజ్%-% చేస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే క మేకర్స్ సుజిత్ -సందీప్ లకు మంచి అవకాశాలు వస్తు న్నాయి. టైర్ 2 హీరోలు కొందరు మంచి కథ తో అప్రోచ్ అవ్వమని అవకాశాలు కల్పిస్తున్నారు. నిర్మాత లైతే తమ బ్యానర్లో చేయాల్సిందిగా అడ్వాన్సులు చెల్లిస్తున్నారు.

# నాని సినిమా ఎగ్జిబిటర్లకు ఊపిరిపోసిందా?

ఒకప్పుడు ఎంత భారీ నిర్మాణ సంస్థ సినిమా చేసినా ముందుగా కథా చర్చల్లో డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ ఉండాల్సిందే. వాళ్లే కథల్లో ఉన్న లోపాలు, ప్రేక్షకులకు నచ్చే అంశాలని చెప్పేవారు. అంతే కాకుండా సినిమా కథ ఫైనల్ అయ్యాక బడ్జెట్లో కొంత భాగాన్ని ముందే నిర్మాతకు అందజేసేవారు. ఇది కొన్నాళ్లు ఓ ఆనవాయితీగా వచ్చింది. కానీ ఇప్పుడు అలా కాదు. డిస్ట్రి బ్యూటర్, ఎగ్జిబిటర్ నిమిత్త మాత్రులయ్యారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. దీంతో నిర్మాతకూ వారికి మధ్య దూరం పెరిగిపోయింది. ఆ దూరం థియేటర్ వ్యవస్థ కుదేలవ్వడానికి ప్రధాన కారణంగా మారింది. నిర్మాతకూ, ఎగ్జిబిటర్కూ దూరం పెరిగి, సినిమాలో అతని భాగస్వామ్యం లేకపోవడంతో చాలా మంది థియేటర్ వ్యవస్థకు గుడ్ బై చెప్పేసి షాపింగ్ మాల్స్ లేదా పెళ్లిళ్లకు ఫంక్షన్ హాల్స్గా మార్చేసుకోవడం తెలిసిందే. ఓటీటీల ప్రభావం పెరగడం, పాన్ ఇండియా సినిమాలు జోరందుకుని స్టార్ హీరోలు రెండు మూడేళ్లకు ఒక సినిమా చేసే స్థాయికి వెళ్లడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఎగ్జిబిటర్లు కుదేలైపోయారు. వారానికో సినిమా పడితేనే థియేటర్లు కళకళలాడే పరిస్థితి. కానీ ఇప్పుడు అది లేదు. ఆ సంప్రదాయం కనుమరుగైపోతోంది. దీంతో థియేటర్లు కాస్తా కళ్యాణ మండపాలుగా మారుతున్నాయి. ఇలాంటి సమయంలో నాని చేసిన ఓ చిన్న సినిమా ఎగ్జిబిటర్ల వ్యవస్థకు ఊపిరిపోసింది. అదే 'కోర్ట్'. చిన్న కథతో, నామినల్ బడ్జెట్తో నాని సమర్పణలో నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి సంచలనాలుసృష్టించిందో తెలిసిందే. ప్రియదర్శి, శివాజీ, హర్ష్ రోషన్, శ్రీదేవి,శివాజీ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాని కేవలం రూ.4 కోట్ల బడ్జెట్తో నిర్మించారు. మార్చి 14న నాని హోమ్తో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కనీవినీ ఎరుగని రీతిలో వండర్స్క్రియేట్ చేసింది. చిన్న సినిమాగా విడుదలై ఏకంగా రూ.57 కోట్లకు పైనే రాబట్టి ట్రేడ్ వర్గాలని విస్మయానికి గురి చేసింది. అయితే ఈ సినిమా కోసం ప్రేక్షకులు థియేటర్లకు రావడంతో ఎగ్జిబిటర్లు ఊపిరి పీల్చుకున్నారట. ఇలాంటి చిన్న చిత్రాలు మరిన్ని రావాలని, అలా వస్తేనే థియేటర్ వ్యవస్థ బతుకుతుందని డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. మరి నిర్మాతలు ఈ మాటల్ని ఆలకించి చిన్న చిత్రాలకు పెద్ద పీట వేసి థియేటర్ వ్యవస్థని కాపాడతారని ఆశిద్దాం.



# ప్యారడైజ్ ఆడియో రైట్స్.. నాని కెరీర్లోనే హయ్యెస్ట్



ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని ఏం పట్టినా బంగారమే అవుతుంది. గత కొన్ని సినిమాలుగా తానేం చేసినా సూపర్ హిట్ లేదా బ్లాక్ బస్టరే అవుతున్నాయి. హీరోగా సక్సెస్ అవడమే కాక నిర్మాతగా కూడా వరుస సక్సెస్ లు అందుకుంటున్నాడు నాని. ప్రతీ సినిమాతో కొత్తదనాన్ని ట్రై చేస్తున్న నాని ఆ కొత్తదనంతోనే అందరినీ మెప్పిస్తూ విన్నర్ గా నిలుస్తున్నాడు. రీసెంట్ గా హిట్వర్స్ లో భాగంగా సొంత బ్యానర్ వాల్పోస్టర్ సినిమాస్ బ్యానర్ లో శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్: ది థర్డ్ కేస్ సినిమాతో హీరోగా, నిర్మాతగా ప్రేక్షకుల ముందుకొచ్చిన నాని ఆ సినిమాతో మరో బ్లాక్ బస్టర్ ను తన అకౌంట్ లో వేసుకున్నాడు. హిట్3 తర్వాత నాని ది ప్యారడైజ్ అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నానికి దసరా లాంటి బ్లాక్ బస్టర్ ను అందించిన శ్రీకాంత్ ఓదెల తో కలిసి నాని ది ప్యారడైజ్ సినిమాను చేస్తున్నాడు. ఇప్పటికే ప్యారడైజ్ నుంచి రా స్టేట్మెంట్ పేరుతో గ్లింప్స్ రూపంలో ఓ వీడియో రిలీజవగా దానికి ఆడియన్స్ నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. గ్లింప్స్ చూస్తుంటే ప్యారడైజ్ లో నాని లార్జర్ దేన్ లైఫ్ క్యారెక్టర్ ను చేయనున్నట్టు అనిపిస్తోంది. నాని కెరీర్లో ఇలాంటి క్యారెక్టర్ చేయడం ఇదే మొదటిసారి అని చెప్పొచ్చు. దానికి తోడు ది ప్యారడైజ్ గ్లింప్స్ కు సౌత్ సెన్సేషన్ అనిరుధ్ ఇచ్చిన మ్యూజిక్ కూడా నెక్ట్స్ లెవెల్ లో ఉంటూ అందరినీ తెగ ఇంప్రెస్ చేసింది. ఇదిలా ఉంటే నాని నటిస్తున్న ప్యారడైజ్ సినిమా ఆడియో రైట్స్ నాని కెరీర్లోనే హయ్యెస్ట్ రేటుకు అమ్ముడు పోయినట్టు తెలుస్తోంది. ప్యారడైజ్ ఆడియో రైట్స్ ను సరిగమ ఆడియో కంపెనీ అన్ని భాషపి రూలనూ కలి. 18కోట్లకు కొనుగోలు చేసింది. నాని సినిమాకు కేవలం ఆడియో ద్వారానే రూ. 18 కోట్లు బిజినెస్ జరిగిందంటే ఇది చిన్న విషయం కాదు. అయితే సరిగమ ఇంత రేటు పెట్టడం వెనుక కొన్ని రీజన్స్ ఉన్నాయి. నాని-శ్రీకాంత్ కాంబినేషన్ మీద హైప్ ఉండటంతో పాటూ, అనిరుధ్ సంగీతానికి సౌత్ లో మంచి క్రేజ్ ఉండటం, దానికి తోడు సినిమా రిలీజ్ కు ముందే నాని సినిమాల్లోని పాటలు మంచి హిట్స్ గా నిలుస్తుండటంతోనే సదరు ఆడియో కంపెనీ అంత భారీ రేటుకు ప్యారడైజ్ ఆడియో హక్కులను సొంతం చేసుకుంది.

# ఇప్పుడు వచ్చి ఏం చేస్తారు కేసరి సాబ్..!



ఈ మధ్య కాలంలో డబ్బింగ్ సినిమాలు అని చిన్న చూపు చూడకుండా భారీ ఆధరణ లభిస్తున్న విషయం తెల్సిందే. పుష్ప సినిమా సౌత్ ఇండియా నుంచి వెళ్లినా నార్త్ ఇండియాలో ఏకంగా వెయ్యి కోట్లకు మించి వసూళ్లు రాబట్టింది. అంతకు ముందు కూడా చాలా సినిమాలు తెలుగులో రూపొంది ఇతర భాషల్లో విడుదల అయ్యి మంచి వసూళ్లు రాబట్టాయి. ఇక ఇతర భాషల్లో సూపర్ హిట్ అయిన సినిమాలు కూడా తెలుగులో డబ్ అయ్యి మంచి వసూళ్లు నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి. కనుక ఎక్కువ శాతం పెద్ద హీరోల సినిమాలు, క్రేజీ సినిమాలను ఒరిజినల్తో పాటు డబ్ వర్షన్ను విడుదల చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు, అలా రెండు వర్షన్లు ఒకే సారి విడుదల అయితేనే మంచి ఫలితం ఉంటుంది. కేసరి చాప్టర్ 2 సినిమా ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హిందీ బాక్సాఫీస్ వద్ద దాదాపుగా రూ.100 కోట్లకు మించి వసూళ్లు చేసిన విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద సాధించిన విజయం నేపథ్యంలో తెలుగులోనూ డబ్ చేసేందుకు రెడీ అవుతున్నారు. మే 23న కేసరి 2 సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నారు. హిందీలో విడుదల అయిన సమయంలోనే తెలుగులో విడుదల చేస్తే కచ్చితంగా మంచి ఫలితం ఉండేది అంటూ బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఒకే సారి అన్ని భాషల్లోనూ విడుదల చేస్తున్నారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం అలా జరగక పోవడం చాలా పెద్ద నష్టంను మిగిల్చింది. ఛావా సినిమా హిందీలో సూపర్ హిట్ కావడంతో తెలుగులో దాదాపు నాలుగు వారాల ఆలస్యంగా తెలుగులో రిలీజ్ చేసిన విషయం తెల్సిందే. హిందీలో విడుదల అయిన సమయంలోనే తెలుగు డబ్బింగ్ వర్షన్ విడుదల అయ్యి ఉంటే కచ్చితంగా వసూళ్లు రెండు మూడు రెట్లు ఎక్కువగా ఉండేవి అనేది బాక్సాఫీస్ వర్గాల మాట. ఛావా సినిమాకు అయినట్లుగానే కేసరి 2 సినిమా తెలుగు వర్షన్కి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అంటూ సినీ వర్గాల వారు మాట్లాడుకుంటున్నారు.

ప్రస్తుతం సినిమా గురించి ఎక్కువగా పబ్లిసిటీ చేయడం లేదు. తెలుగు మార్కెట్ను దృష్టిలో పెట్టుకుని విభిన్నంగా ప్రచారం చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. 1919లో జరిగిన జలియన్ వాలాబాగ్ ఊచకోత కేసు ఎలా కోర్టులో సాగింది, దాని తీరు తెన్నుల గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ సినిమాలో లాయర్ సి శంకర్ నాయర్ జీవిత చరిత్రను చూపించారు. శంకర్ నాయర్ పాత్రలో అక్షయ్ కుమార్ నటించారు. బాలీవుడ్లో సూపర్ హిట్ అయిన ఈ సినిమాను ఇతర భాషల్లో విడుదల చేయాలని అని అనుకోవడం మంచి విషయం. కానీ చాలా ఆలస్యం అయిందని, అంతా ఓటీటీ స్ట్రీమింగ్ కోసం వెయిట్ చేస్తున్నారు. ఇలాంటి సమయంలో థియేట్రికల్ స్క్రీనింగ్ అనేది చాలా తప్పుడు నిర్ణయం అనేది కొందరి అభిప్రాయం. కేసరి కనీసం రెండు మూడు వారాల క్రితం వచ్చినా ఫలితం బాగుండేది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# బాలీవుడ్ ఇండస్ట్రీకి ఆ హీరో డాన్ లాంటోడా!



బాలీవుడ్ ఇండస్ట్రీకి డాన్ తరహా హీరో ఒకడున్నాడా? అతడు కన్నెర్ర జేసాడంటే పరిశ్రమ ఒణికిపోతుందా? అతడిని ముందు నిలబడి మాట్లాడాలంటేనే డైరెక్టర్లు ఒణికిపోతారా? అతడి ఇంటికి ఎవరెళ్లినా చేతులు కట్టుకుని నుంచో వల్సిందేనా? అంటే అవుననే అంటున్నాడు డైరెక్టర్ వివేక్ అగ్ని హెూత్రి. 'యానిమల్' సినిమా విషయ లో ఆ సినిమా డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగాను మాత్రమే విమర్శించారు. మరి అందులో అంత రూడ్ పాత్రలో కనిపించిన రణబీర్ కపూర్ ని ఎందుకు విమర్శించలేదు. అతడిపై బాలీవుడ్ మీడియాలో ఒక్క విమర్శ కూడా రాలేదు. ఇండస్ట్రీలో అయితే అసలు చర్చకే రాలేదు. ఎందు కంటే రణబీర్ని విమర్శించే ధైర్యం ఇండస్ట్రీలో ఎవరికీ లేదు. ఇండస్ట్రీలో అతడు చాలా పవర్ ఫుల్ . ఓ డాన్ లా పరిశ్రమను ఏలుతున్నాడు. అతడిని విమర్శించడం పక్కనబెట్టండి ధైర్యంగా ముందుకొచ్చి కూడా మాట్లాడలేరు. అంత ధైర్యం ఉంటే ఎవరినైనా అలా ఓ సారి ప్రయత్నించి చూడమనండి. చాలా మంది దర్శకులు హీరోల గురించి వారి వెనుక మాట్లాడుతారు. బహిరంగంగా ముందుకొచ్చి చెప్పే ధైర్యం ఎవరూ చేయరు. రణబీర్ విషయంలో అయితే అస్సలు రిస్క్ తీసుకోరు. ఎవరైనా ఆయన చెప్పింది చేయాల్సిందే. అలా డాన్ తరహా పాత్రలు పోషించే వారికే నిర్మాతలు కూడా వందల కోట్లు పారితోషికం ఇస్తుంటారు. వారు భయపడి ఇస్తారా? సినిమా కోసం ఇస్తారా? అన్నది ఒక్కోసారి అర్థం కాదన్నారు. నిజమైన స్టార్ కు భారీ మొత్తంలో చెల్లించినా అర్థముంటుంది. ఏ ఇమేజ్ లేకుండా కూడా కోట్లు దండుకుంటున్నారు. ఇదెంత వరకూ న్యాయమని వికేవ్ అభిప్రాయపడ్డారు. మరి ఈ వ్యాఖ్యలపై బాలీవుడ్ నుంచి ఎవరైనా స్పందిస్తారా? అన్నది చూడాలి.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh, epaper. www.saisuryaa.com.saisuryaadaily @gmail.com